ప్రజాశక్తి
ఆదివారం 26 నవంబర్ 2023

డిసెంబర్ 8న అంగన్వాడీల సమ్మె

- రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని తలపెట్టిన డిసెంబర్ 8 సమ్మెను విజయవంతం చేయాలని, ప్రజా సంఘాలతో కార్మిక సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం అంగన్వాడి వర్కర్స్ యూనియన్ నాయకురాలు వెంకటమ్మ, సునందల అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయలలితమ్మ, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యధర్శులు పిఎస్. రాధాకృష్ణ, ఎండి.అంజిబాబు, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప మాట్లాడారు. జయలలితమ్మ మాట్లాడుతూ వైఎస్. జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అంగన్వాడి వర్కర్ల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ ప్రభుత్వం కంటే రూ.ఒక వెయ్యి జీతం ఎక్కువ ఇస్తానని హామీ ఇచ్చి దాన్ని తుంగలో తొక్కాడని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, ఫేస్ యాప్ రద్దు చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడీ వర్కర్లకు గ్రాడ్యుటీ ఇవ్వాలని ఎన్నిసార్లు ఆందోళన చేసినా రాష్ట్ర ప్రభుత్వం స్పందించలేదన్నారు. అందుకే డిసెంబర్ 8న చేపట్టిన సమ్మెను విజయవంతం చేయాలన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు మాట్లాడుతూ అంగన్వాడీలతో అన్ని ప్రభుత్వ పథకాలలో పనిచేస్తున్న వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేస్తుందన్నారు. తక్షణమే అంగన్వాడీల సమస్యలు పరిష్కారం అయ్యేందుకు రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలని లేకపోతే సమ్మె వలన ప్రజలకు బాలింతలకు జరిగే ఇబ్బందులకు, కష్టాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి అంగన్వాడీలకు మద్దతుగా ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమన్న ,శరత్ ఎఐవైఎఫ్ నగర కార్యదర్శి బీసన్న, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగేష్ ఐఎఫ్‌టియు నాయకులు అరుణ్ ,గచ్చి కూలి సంఘం నాయకులు వెంకటస్వామి, ఎఐటియుసి నగర కార్యదర్శి జి. చంద్రశేఖర్, ఉప కార్యదర్శి రామాంజనేయులు మద్దతు పలికారు. అంగన్వాడి వర్కర్స్ యూనియన్ నాయకులు రుక్మిణి చాందిని, సునంద, చౌడేశ్వరి ,భాగ్యమ్మ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

రూ.720 కోట్లతో నగరాభివృద్ధి

- మేయర్ బివై.రామయ్య - ఎక్కడి సమస్యలు అక్కడే ఉంటే అభివృద్ధి ఎలా..? - కార్పొరేటర్ల ఎదురు ప్రశ్నలు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

రెండున్నరేళ్లలో అంటే 2021 మార్చి నుంచి నేటి వరకు అందరి సహకారంతో, ముఖ్యమంత్రి నిధులు ఇవ్వడంతో కర్నూలు నగరంలో రూ.720 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని మేయర్ బివై.రామయ్య తెలిపారు. అభివృద్ధి పనులు చేసినట్లు చెప్పినప్పుడు చప్పట్లు కొట్టాలని మేయర్ సభ్యులకు సూచించారు. కొన్ని వార్డుల్లో పనులు చేసి నగరం అభివృద్ధి చెందిందని చెబితే చప్పట్లు ఎలా కొట్టాలని కొందరు కార్పొరేటర్లు మేయర్‌కు ఎదురు ప్రశ్నలు వేశారు. బుధవారపేటలో మురుగుదొడ్లు, ఎక్కడ పడితే అక్కడ గుంతలు తవ్వి వదిలిపెట్టడం, వర్షాలు వస్తే లోతట్టు ప్రాంతాలు నీట మునగడం, తగిన శానిటేషన్ సిబ్బంది లేకపోవడం, యూజర్ చార్జీలు ఏకకాలంలో చెల్లించాలని ప్రజలను ఇబ్బంది పెట్టడం వంటి సమస్యలు వెంటాడుతుంటే అభివృద్ధి అంటే ఎలా అని సభ్యులు మేయర్‌ను నిలదీశారు. నగర పరిధిలోకి వచ్చే ముగ్గురు ఎమ్మెల్యేలు కూడా వారి పరిధిలోని సమస్యలను ఏకరువు పెట్టారు.

శనివారం నగర పాలక సంస్థ సర్వసభ్య సాధారణ సమావేశం నూతన సమావేశ మందిరంలో మేయర్ బివై.రామయ్య అధ్యక్షతన నిర్వహించారు. 64 అంశాలపై అజెండా పెట్టి చర్చించారు. పాలకమండలి వచ్చాక వార్డుల్లో అభివృద్ధి భారీగా చేస్తున్నామని చెప్పగా కార్పొరేటర్ విక్రమసింహారెడ్డి అభినందనలు తెలిపారు. మేయర్ చప్పట్లు కొట్టాలని చెప్పగా కార్పొరేటర్ పర్వేజ్ కొన్ని వార్డుల్లో అభివృద్ధి జరిగితే అన్ని వార్డుల్లో జరిగినట్లా, ఎందుకు చప్పట్లు కొట్టాలని మేయర్‌ను నిలదీశారు. మేయర్ యూజర్ చార్జీలు 50 శాతం తగ్గించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ చప్పట్లు కొట్టాలని చెప్పినట్లు సర్దుకొచ్చారు. గతంలో వేసిన యూజర్ చార్జీలు ఒకేసారి చెల్లించమనడం సరికాదన్నారు. ఎవరినీ బలవంత పెట్టకూడదని తెలిపారు. బుధవారపేటలో మహిళలకు మురుగుదొడ్లు లేక, ఉన్న వాటిని శుభ్రం చేయక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కార్పొరేటర్ తెలిపారు. కనీస అవసరాలు కూడా తీర్చలేదని, అభివృద్ధి చేశామనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. 17వ వార్డులో ఇళ్లలోకి నీరు వస్తోందని, కాంట్రాక్టర్ శ్రీనివాసరెడ్డి రోడ్డు తవ్వి వదిలేస్తే ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పగా.. మరమ్మతులు చేయిస్తామని కమిషనర్ సమాధానం ఇచ్చారు. భారీ వర్షాలు కురిసినప్పుడల్లా సుద్దవాగు పొంగిపొర్లి ఇళ్లలోకి నీరు చేరుతోందని, ఇరిగేషన్ అధికారులతో రివ్యూ మీటింగ్ పెట్టుకుని డిజైన్ చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. పాణ్యం నియోజకవర్గంలో రాత్రి పూట నీరు వదలడంతో మోటార్ వేసినప్పుడు అదనంగా 10 ట్రాన్స్‌ఫార్మర్లు వేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. వీకర్ సెక్షన్ కాలనీలో మురుగు కాలువలు చిన్నవిగా ఉండడం వల్ల డిస్పోజల్ డ్రెయిన్లు లేక రోడ్లపై నీరు నిలుస్తోందని, వాటి స్థానంలో కొత్త డ్రెయిన్లు నిర్మించాలని తెలిపారు. డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక మాట్లాడుతూ... 'వై' జంక్షన్‌ను అభివృద్ధి చేయాలని సూచించారు. జమ్మి చెట్టు వద్ద గల ముస్లిం శ్మశాన వాటికలో లైటింగ్ ఏర్పాటు చేసి సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేయాలని కోరారు.

పార్కుల్లో కేర్ టేకర్స్‌ను ఏర్పాటు చేయాలి

కర్నూలు ఎమ్మెల్యే ఎం.ఎ.హాఫీస్ ఖాన్ మాట్లాడుతూ... పార్కులను అభివృద్ధి చేసిన తర్వాత కేర్ టేకర్స్‌ను పెట్టాలని సూచించారు. కర్నూలు నగర జనాభాకు అనుగుణంగా శానిటేషన్ వర్కర్లను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. శానిటేషన్ సెక్రటరీలకు పని భారం పెరిగిందని, టౌన్ ప్లానింగ్ సెక్రటరీలను వినియోగించుకోవాలని సూచించారు. యూజర్ చార్జీలను కచ్చితంగా వసూలు చేయాలనే డిమాండ్లను విరమించుకోవాలన్నారు. 1వ వార్డులో 40 దళిత కుటుంబాలు ఉన్నాయని, వారిని ఖాళీ చేయకుండా కనీసం ఒక్కొక్కరికి మూడు సెంట్ల స్థలం ఇచ్చి సహకారం అందించాలని చెప్పారు. నగరంలో జనాభా ఎక్కువగా ఉన్న చోట తక్కువ మంది, తక్కువ జనాభా ఉన్న చోట ఎక్కువమంది వార్డు సెక్రటరీలు ఉన్నారని, వారిని రేషనలైజేషన్ చేసి ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని తెలిపారు. బరియల్ గ్రౌండ్స్ పనులను పూర్తి చేయాలని, 17వ వార్డులో కార్టూన్ పార్కు, 5వ వార్డు గార్డెన్‌లో మహిళల పార్కును పెట్టి పూర్తి చేయాలన్నారు. మలేరియా డిపార్టుమెంట్ పనిచేస్తే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు.

ప్రజల కనీస అవసరాలు తీర్చాలి

పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ... నియోజకవర్గంలో ఎక్కువగా పనులు చేసుకునేవారు ఉన్నారని, వారికి రాత్రిపూట నీరు వదలకుండా చూడాలని తెలిపారు. వీకర్ సెక్షన్ కాలనీ, నూతనంగా విస్తరిస్తున్న కాలనీల్లో కనీసం డ్రెయినేజీలు, మెటల్ రోడ్లు నిర్మించాలని చెప్పారు. కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ మాట్లాడుతూ... స్టాంటన్‌పురం, సంతోష్ నగర్‌కు కనెక్టివిటీ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, రెండు ప్రాంతాలను కలిపే విధంగా రోడ్లు వేసి సమస్యను పరిష్కరించాలని కోరారు. డిస్పోజల్ డ్రెయిన్ లేక మురుగునీరు ఎక్కడ అంటే అక్కడ నిలిచిపోతుందన్నారు. ఆ నీటిని ఎలా డిస్పోజల్ చేయాలో డిజైన్‌ను తయారు చేసే విధంగా ఇంజినీర్లు కృషి చేయాలని సూచించారు. నగరంలో చేసిన అభివృద్ధి గురించి ప్రజలకు తెలియజేసే విధంగా ప్రచారం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి

మేయర్ బివై.రామయ్య మాట్లాడుతూ... నగరంలో అందరి సహకారంతో రూ.720 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. రోడ్లు, డ్రెయినేజీ కాలువలు, కల్వర్టులు, అర్బన్ హెల్త్ సెంటర్లు, సిబిఎస్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు, అమృత వన్, టూ నిధులతో పైపు లైన్లు, నీటి సమస్య పరిష్కారం, సీపేజ్ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు, స్టేడియంలాంటి అనేక పనులను చేసుకోగలిగామని తెలిపారు. కమిషనర్ ఎ.భార్గవ్ తేజ, అదనపు కమిషనర్ పివి.రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్‌వి.శివారెడ్డి, ఎస్ఇ వేణుగోపాల్, ప్రజారోగ్య అధికారి కె.విశ్వేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ రామయ్య, కమిషనర్ భార్గవ్ తేజ

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ డాక్టర్ సృజన

ప్రజాశక్తి - గోనెగండ్ల

కేంద్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. శనివారం గోనెగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో 'వికసిత్ భారత్ సంకల్పయాత్ర' కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఉజ్వల్ ఉచిత గ్యాస్ కనెక్షన్, ఆయుష్మాన్ భారత్ పథకాలకు దరఖాస్తు చేసుకొని లబ్ధి పొందాలని సూచించారు. ఎవరైనా అర్హులైన వారు పథకాలు అందకుంటే సంబంధిత అధికారులను సంప్రదించాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపై ప్రతి పంచాయతీలోనూ అవగాహన కల్పించేందుకు 'వికసిత్ భారత్ సంకల్పయాత్ర'ను జిల్లాలోని 484 పంచాయతీల్లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ యాత్రలో ఉజ్వల్ ఆయుష్మాన్ భవ, కిసాన్ క్రెడిట్ కార్డు, భూసార పరీక్షలు, జీవనజ్యోతి, బీమా సురక్ష, బీమా అటల్ పెన్షన్ యోజన, హర్ ఘర్ జల్ లాంటి 17 పథకాల గురించి తెలుసుకోవడంతోపాటు అర్హులు ఉండి ఎవరైనా ఈ పథకాలు అందకుంటే దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమం జిల్లాలోనే కాకుండా దేశమంతా జనవరి 26 వరకు నిర్వహిస్తున్నారని వివరించారు. జడ్‌పి సిఇఒ నాసరరెడ్డి, డిఇఒ రంగారెడ్డి, ఎంపిపి నసురుద్దీన్, సర్పంచి హైమావతి, మాజీ కోఆప్షన్ సభ్యులు బందే నవాజ్, తహశీల్దార్ వేణుగోపాల్, ఎంపిడిఒ ప్రవీణ్ కుమార్, ఇఒఆర్‌డి నగేష్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

- రాజ్యాంగం పీఠిక చదివి ప్రతిజ్ఞ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు డాక్టర్స్ కాలనీలో ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో ఘనంగా రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎ.సత్య నారాయణ అధ్యక్షతన శనివారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డి.శ్రీనివాసులు ప్రజా ఐక్యవేదిక' జిల్లా అధ్యక్షుడు , రిటైర్డ్ ప్రిన్సిపల్ నాగరాజు , ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా జనరల్ సెక్రెటరీ ఎం. రవికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చేసిన కృషి, రాజ్యాంగంలోని అన్ని అంశాలను విద్యార్థులు కూలంకషంగా తెలుసుకోవాలని పేర్కొన్నారు. రాజనీతి శాస్త్ర అధ్యాపకురాలు వి.నాగరత్నమ్మ విద్యార్థులు, అధ్యాపకులతో రాజ్యాంగ పీఠికను చదివి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సమావేశంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర బృందం చ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది

తప్పుల తడక...

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

ప్రభుత్వం చేపట్టిన భూ సర్వే తప్పుల తడకగా కనిపిస్తోంది. గత కొన్నేళ్లుగా అనుభవంలో ఉన్న భూమి ఇప్పుడు భూ సర్వే చేసిన అనంతరం కనిపించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. భూ సర్వే ద్వారా భూ సమస్యలు తగ్గుతాయని భావిస్తే మరిన్ని భూతగాదాలకు కేంద్ర బిందువుగా మారుతోంది. ఎక్కడా నిబంధనలు పాటించకుండా నామమాత్రంగానే సర్వే నిర్వహిస్తున్నారు. రైతులకు భూసర్వే మాత్రం భరోసా కల్పించలేక పోతోంది. భూ హక్కు పత్రాల్లో కూడా తప్పుల తడక వివరాలను నమోదు చేసి అందజేస్తున్నారు. దాదాపు వందేళ్ల క్రితం బ్రిటీష్ హయాంలో రెవెన్యూ భూముల సర్వేను నిర్వహించారు. అనంతరం అనేక ప్రభుత్వాలు భూ సర్వేకు చర్యలు తీసుకున్నప్పటికీ అనుకున్న ఫలితాలు సాధించలేకపోయాయి. కేంద్ర ప్రభుత్వం 2008లో చేపట్టిన జాతీయ భూ రికార్డుల ఆధునీకరణ కార్యక్రమం అమలులో భాగంగా రాష్ట్రంలోని జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం గత రెండు సంవత్సరాల క్రితం జగనన్న శాశ్వత భూహక్కు భూ సర్వే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మూడు దశల్లో భూహక్కు భూ సర్వే కార్యక్రమాన్ని పూర్తి చేయాలని ప్రభుత్వం సన్నద్ధమయింది. ఈ ఏడాది డిసెంబర్ నాటికి సర్వే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. సర్వే నిర్వహించేందుకు స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ విధానాన్ని రూపొందించారు. ఈ విధానం కింద క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహణపై ఆదేశాలు జారీ చేశారు. భూ రికార్డుల స్వచ్ఛీకరణలో భాగంగా డ్రోన్ల ద్వారా శాటిలైట్ సహకారంతో గ్రామం మ్యాప్‌ను ఫొటో తీసి ఆ సమాచారాన్ని నేరుగా సర్వే ఆఫ్ ఇండియాకు అందజేస్తారు. సర్వేకు సంబంధించి ముందస్తుగా నోటీసులను సర్వే బృందాలు రైతులకు అందజేస్తాయి. రైతుల భూ సర్వే చేసిన అనంతరం ఫైనల్ రికార్డును ప్రకటించేటప్పుడు తప్పనిసరిగా గ్రామసభలు నిర్వహించాలి. జిల్లాలో ఎక్కడా గ్రామసభలు నిర్వహించి, ప్రత్యేకంగా రెవెన్యూ రికార్డును ప్రకటించలేదు. దీనివల్ల అనేకమంది రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. భూ హక్కు పత్రాల్లో కూడా అనేకమంది రైతులకు తక్కువ భూమి పొందుపరచడంతో రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ఈ సర్వే మాత్రం తూతూమంత్రంగానే నిర్వహించి సరికొత్త భూవివాదాలకు కారణం అవుతోంది.

అంగన్వాడీ సమస్యలపై...

అంగన్వాడీ వర్కర్లు, ఆయాల సమస్యలను పరిష్కరించాలని జిల్లావ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించారు. డిసెంబర్ 8 నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్న నేపథ్యంలో అధికారులకు సమ్మె నోటీసులు అందజేశారు. అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అవీ..ఇవీ..అన్నీ..

మెడికల్ కాలేజీ సెక్యూరిటీ గార్డులకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలని ప్రిన్సిపల్‌కు సిఐటియు నాయకులు వినతి పత్రం సమర్పించారు. సెన్సార్ సిసి టివి కెమెరాల ద్వారా ఆటోలకు జరిమానా విధించడాన్ని వ్యతిరేకిస్తూ పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. రైల్వే ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ జిల్లావ్యాప్తంగా పలు రైల్వే స్టేషన్ల ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో ధర్నాలు చేపట్టారు. వైసిపి ఆధ్వర్యంలో జిల్లాలోని పలు ప్రాంతాల్లో 'ఏపికి జగనే ఎందుకు కావాలి' కార్యక్రమాన్ని నిర్వహించారు. టిడిపి ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ..భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని జిల్లాలోని పలు ప్రాంతాల్లో చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుకు హైకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో టిడిపి నాయకులు సంబరాలు జరుపుకున్నారు.

మైపర్‌లో ర్యాగింగ్‌పై అవగాహన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు నగరంలోని ఎ క్యాంపులో గల మైపర్ ఫార్మసీ కళాశాలలో ర్యాగింగ్ పైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు డిఎస్‌పి కె.విజయ శేఖర్ ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు ర్యాగింగ్ పైన అవగాహన కల్పించారు. డిఎస్‌పి మాట్లాడుతూ విద్యార్థి జీవితం ఎంతో విలువైనదని ఈ సమయంలో విద్య పైన కాన్సన్‌ట్రేట్ చేసి జీవితంలో స్థిరపడాలని వేరే వాటిపైన అనగా అనవసరమైన విషయాలు రాగింగ్ చెడు స్నేహాలు మత్తుపదార్థాలు వాటికి దూరంగా ఉంటూ ర్యాగింగ్ చేసినచో చట్టాలు చాలా కఠినంగా ఉన్నాయన్నారు. విద్యార్థులు ర్యాగింగుతో జీవితాలను నాశనం చేసుకోవద్దని, ఉజ్వల భవిష్యత్తు ఉన్నదని తెలిపారు. మైపర్ డైరెక్టర్ డాక్టర్ సతీష్ విద్యార్థులకు ర్యాగింగ్ నుంచి ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ డాక్టర్ జయరవి కుమార్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కాసర్ల సురేష్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డి.విజయశేఖర్

షేపీఎన్ట్ సైనిక అకాడమిలో సైనిక పాఠశాల ప్రవేశానికి ఉత్తమ శిక్షణ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

విద్యార్థులకు బంగారు భవిష్యత్ ఇవ్వడానికి షేపీఎన్ట్ సైనిక అకాడమీ స్థాపించామని అకాడమీ డైరెక్టర్ స్టీఫెన్ తెలిపారు. అకాడమీ స్థాపించిన అనతికాలంలోనే 17 సైనిక్ సీట్లు, 5 నవోదయ సీట్లు పొందమన్నారు. తమ విద్యార్థి గత ఏడాది తెలుగు రాష్ట్రా నుండి మొదటి ర్యాంక్ సాధించరన్నారు. కేంద్రప్రభుత్వ రక్షణ మంత్రిత్వ శాఖ పరిధిలో నడిచే సైనిక స్కూళ్లల్లో 2024-25 విద్యా సంవత్సరానికిగానూ ఆరో తరగతి, తొమ్మిదో తరగతిలో ప్రవేశాలను ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (ఏఐఎస్ఎస్ఈఈ-2024) ద్వారా కల్పించడానికి అర్హులైన బాలబాలికల నుంచి దరఖాస్తులు కోరుతూ నోటిఫికేషన్ విడుదల చేసిందని తెలిపారు. ఈ నోటిఫికేషన్ ద్వారా దేశ వ్యాప్తంగా ఉన్న సైనిక స్కూళ్లలో ప్రవేశాలు కల్పించనున్నారన్నారు. ఈ ప్రవేశ పరీక్షను సైనిక్ స్కూల్ సొసైటీ నిబంధనల ప్రకారం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ) నిర్వహిస్తోందని తెలిపారు. ఆరు, ఎనిమిదో తరగతి చదువుతున్నవారు అర్హులన్నారు. ఆసక్తికలిగిన విద్యార్థులు ఆన్‌లైన్ విధానంలో డిసెంబర్ 16లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు సమయంలో జనరల్ విద్యార్థులు రూ.650లు, ఎస్సీ/ఎస్టీ విద్యార్థులు రూ.500లు అప్లికేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. పరీక్ష ఆఫ్‌లైన్ మోడ్‌లో జనవరిలో నిర్వహిస్తారన్నారు. ఆరో తరగతిలో ప్రవేశాలు పొందగోరే విద్యార్థుల వయసు 10 నుంచి12 ఏళ్ల మధ్యలో ఉండాలన్నారు. తొమ్మిదో తరగతిలో ప్రవేశం పొందగోరే విద్యార్థుల వయసు 13 నుంచి 15 ఏళ్ల మధ్యలో ఉండాలన్నారు.

చిన్న వ్యాపారులకు రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నగరంలోని కార్మిక కర్షక భవనంలో బి.గోపాల్ అధ్యక్షతన న్యూ సిటీ చిన్న వ్యాపారస్తుల సంఘం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి సిహెచ్ .సాయిబాబా, సిఐటియు నగర ఉపాధ్యక్షులు టి.రాముడు, చిన్న వ్యాపారస్తుల సంఘం నగర ప్రధాన కార్యదర్శి ఎస్.మహమ్మద్ రఫీ మాట్లాడుతూ కర్నూలు నగరం స్మార్ట్ సిటీ పేరుతో రెడ్ జోన్, గ్రీన్ జోన్ ,ఎల్లో జోన్ పేర్లతో రోడ్లకు ఇరువైపులా ప్రభుత్వంపై ఆధారపడకుండా తమ సొంత పెట్టుబడితో జీవిస్తున్న చిన్న వ్యాపారస్తులను తొలగించడం, కేసులు పెట్టి వేధించడం సరైంది కాదని అన్నారు. కర్నూలు కార్పొరేషన్ పరిధిలోని ప్రధాన రోడ్లకు అనేక ప్రాంతాలలో ప్రభుత్వ స్థలాలు ఉన్నాయని వాటిలో చిన్న వ్యాపారస్తులకు చిన్నచిన్న షాపులు నిర్మించి తక్కువ బాడిగతో చిన్న వ్యాపారస్తులకు ఇచ్చి వారిని ప్రోత్సహించడం ద్వారా కర్నూలు నగరం స్మార్ట్ సిటీగా ఉంటుంది తప్ప గోడలకు రంగులు వేయడం ద్వారా కాదని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తామని ఉద్యోగాలు ఇస్తామని ఇచ్చిన మాటను తప్పారని అన్నారు. చదువుకొని ఉద్యోగాలు రాక తమ సొంత పెట్టుబడితో చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుటున్న వారిని ప్రోత్సహించాలని అన్నారు. చిన్న వ్యాపారస్తుల రక్షణ కోసం నగరంలో జీవిస్తున్న వ్యాపారస్తులందరూ ఐక్యం కావలసిన సమయం ఆసన్నమైందన్నారు. చిన్న వ్యాపారులపై పెడుతున్న కేసులు దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సహాయ కార్యదర్శి ఎస్ఎండి.గౌస్, కమిటీ సభ్యులు మళ్లీ, ఎస్ గోపాల్ ,అశోక్ ,హుస్సేన్ సాహెబ్ ,విజయ్, చాంద్ కమిటీ సభ్యులు, చిన్న వ్యాపారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిహెచ్ సాయిబాబు, వేదికపై రాముడు తదితరులు

రిజిస్ట్రార్‌ను వెంటనే తొలగించాలి

ఆర్‌యు విసికి నాన్ టీచింగ్ ఉద్యోగుల వినతి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ విశ్వవిద్యాలయంలో రిజిస్ట్రార్‌గా సుందరానందపుచ్చ అనర్హుడని వెంటనే ఆయనను తొలగించాలని వర్సిటీ నాన్ టీచింగ్ ఉద్యోగులు అసోసియేషన్ నాయకులు శంకర్ డిమాండ్ చేశారు. శనివారం వర్సిటీ ఇన్‌ఛార్జి విసి ఫజల్ రెహమాన్‌ను నాన్ టీచింగ్ ఉద్యోగులు కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. గత కొన్నేళ్లుగా వర్సిటీలో పనిచేస్తున్న తమను అన్యాయంగా తొలగించేసారని పేర్కొన్నారు. తిరిగి విధుల్లోకి తీసుకోవాలని గతంలో పనిచేసిన విసి ఆనందరావుకు విన్నవించుకున్నా పట్టించుకోలేదన్నారు. తమను తొలగించి దాదాపుగా ఏడు నెలలు అయ్యిందన్నారు. వెంటనే తిరిగి విధుల్లోకి తీసుకొని తమ కుటుంబాలకు న్యాయం చేయాలని విన్నవించారు. వర్సిటీ రిజిస్ట్రార్‌గా పనిచేసే సుందరానందపుచ్చను తొలగించి వేరే వారిని నియమించాలని కోరారు. అనంతరం రిజిస్ట్రార్ ఛాంబర్ లోకి వెళ్లి రిజిస్ట్రార్‌తో వాగ్వాదానికి దిగారు. తమకు అన్యాయం చేసిన మీరు ఈ పదవికి వెంటనే రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. లేకపోతే సోమవారం నుండి ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

అకాడమిక్ పై దృష్టి సారిస్తా

ఆర్‌యు బాధ్యతలు స్వీకరించిన ఇన్చార్జి విసి పజుల్ రెహమాన్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ :

రాయలసీమ యూనివర్సిటీలోని అకాడమిక్ పై ప్రధానంగా దృష్టి సారిస్తున్నట్లు రాయలసీమ ఇన్‌ఛార్జి విసి ఫజుల్ రెహమాన్ పేర్కొన్నారు. శనివారం వర్సిటీలోని వైస్ ఛాన్సలర్ కార్యాలయంలో ఉర్దూ యూనివర్సిటీ విసి ఫజుల్ రెహమాన్ రాయలసీమ విసిగా ఇన్‌ఛార్జి బాధ్యతలను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతానికి వర్సిటీలో ఉన్న సమస్యలపై అధ్యయనం చేసి వాటిని పరిష్కరిస్తానని పేర్కొన్నారు. టీచింగ్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీపై నియమ నిబంధనలు ప్రకారం చేపడతా మన్నారు. ఇక్కడి నాన్‌టీచింగ్ ఉద్యోగుల సమస్యలను కూడా అధ్య యనం చేస్తామని అన్నారు. వర్సిటీ రెక్టార్ సివి.కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ సుందరా నందపుచ్చా, సిడిసిడి ఎన్‌టికె. నాయక్ ఇతర అధ్యాపకులు కలిసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.



జగనన్న ఇళ్లు త్వరగా పూర్తి చేయాలి : ఎఇ

ప్రజాశక్తి- సి బెళగల్: జగనన్న ఇళ్ళు నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకోవాలని హౌసింగ్ ఎఇ సుమంత్ లబ్ధిదారులకు సూచించారు. శనివారం బురాన్ దొడ్డి, కంభదహాల్ లో పనులను పరిశీలించారు. బెస్మెంట్ లెవల్ 31, లెంటల్ లెవల్ 11 ఉన్నాయని, పనులను పూర్తి చేసుకుంటే సకాలంలో బిల్లులు అందిస్తామని తెలిపారు.

జొన్నగిరిలో వజ్రం లభ్యం

రు.5 లక్షలకు కొన్న వ్యాపారి..?

ప్రజాశక్తి-తుగ్గలి

కర్నూలు జిల్లా మండలం జొన్నగిరి గ్రామంలో శనివారం ఒక రైతుకు వజ్రం లభ్యం కాగా ఆ వజ్రాన్ని అదే గ్రామానికి చెందిన ఒక వ్యాపారి రు.5 లక్షలకు కొన్నట్లు తెలుస్తోంది. అదేవిధంగా గత వారం క్రితం జొన్నగిరి గ్రామంలో అత్యంత విలువైన వజ్రం లభ్యం కాగా ఆ వజ్రాన్ని అదే గ్రామానికి చెందిన మరొక వ్యాపారి రు.10 లక్షలకు కొన్నట్లు సమాచారం. చినుకు పడితే చాలు తుగ్గలి మండలం పరిధిలోని జొన్నగిరి, ఎర్రగుడి, ఉప్పర్లపల్లి, మదనంతపురం, రాంపురం తదితర గ్రామాలలో అత్యంత విలువైన వజ్రాలు దొరుకుతుంటాయి. ఈ వజ్రాలను అదే గ్రామానికి చెందిన కొంతమంది వ్యాపారులు అత్యంత విలువైన వజ్రాలు సైతం తక్కువ రేట్లకి కొంటున్నట్లు తెలుస్తోంది. వజ్రాలు విలువ తెలియని అమాయక ప్రజలు కేవలం తక్కువ రేట్లకే అమ్ముతుంటుంటారు. వజ్రాల వ్యాపారులు తక్కువ రేటుకు కొని ఎక్కువ రేట్లకు ముంబై, దుబాయ్ చెన్నై తదితర పట్టణాలలో అమ్ముతున్నట్లు తెలుస్తోంది. ఇంత జరుగుతున్నప్పటికీ రెవిన్యూ, పోలీసులు పట్టించుకోకపోవడం విచారకరం.

పత్తికొండలో విద్యార్థులకు అభివాదం చేస్తున్నజిల్లా కార్యదర్శి అబ్దుల్లా తదితరులు

సీజనల్ హాస్టళ్లు ఏర్పాటు చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-పత్తికొండ

కరువు పీడిత ప్రాంతాలో విద్యార్థులు వలసలు వెళ్లకుండా సీజనల్ హాస్టళ్లు ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పత్తికొండ జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు మధు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా ,జిల్లా ఉపాధ్యక్షులు రవికుమార్ మాట్లాడారు. కర్నూలు జిల్లాలో కరువు మండలాలు ప్రకటించినప్పటికీ మండలాల్లో విద్యార్థులు వలసలకు వెళ్లకుండా నివారించి వారి చదువు కోసం ప్రభుత్వం సీజనల్ హాస్టళ్లను ఏర్పాటు చేయాలన్నారు. ఉచిత బస్సు సౌకర్యం కల్పించి విద్యార్థులకు ఉచిత ఫీజులు కల్పించే విధంగా ఏర్పాటు చేసి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. విద్యాభివృద్ధికి తోడ్పడాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పత్తికొండలో బీసీ హాస్టళ్లను పునర్ నిర్మించి ,. వృత్తివిద్య కోర్సులను ఏర్పాటుచేసి పాలిటెక్నిక్ కళాశాలలను ప్రారంభించాలని కోరారు.

నూతన మండల కమిటీ ఎన్నిక : పత్తికొండ మండల అధ్యక్షుడుగా నరసింహా, ప్రధాన కార్యదర్శిగా రంజిత్ కుమార్, ఉపాధ్యక్షులుగా ఆదర్శ, నాగార్జున ,ఏకాంతం, సహాయ కార్యదర్శిలుగా ప్రసాదు, విష్ణు, గోపాలకృష్ణలతోపాటు మరో 20 మందితో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

రైతులకు అండగా నిలుద్దాం

- రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి - గోనెగండ్ల

దేశానికి అన్నం పెట్టే రైతులకు అండగా నిలవాలని రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ కోరారు. శనివారం మండలంలోని చిన్నమరివీడు గ్రామంలో రైతుసంఘం ఆధ్వర్యంలో గ్రామ రైతులతో సమావేశం నిర్వహించారు. కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కరుణాకర్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా రామకృష్ణ, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్.డి.ఆనంద్ బాబు, కాటికాపరి గుంతల శీను బాగారంల సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణలు హాజరయి మాట్లాడారు. దేశంలో, రాష్ట్రంలో రైతే వెన్నెముక అని చెప్తూనే తిరిగి పార్టీలు రైతాంగం చులకనగా చూస్తూ రైతు హక్కులను కాలరాస్తున్నాయని మండిపడ్డారు. రైతాంగం ఐక్యమైతే ఏ జరుగుతుందో ఢిల్లీలో జరిగిన రైతుల ఉద్యమం చెబుతోందని, ఈ ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని, రైతుల పంటలకు గిట్టుబాటు ధర కోసం పోరాటమే మార్గమని తెలిపారు. ఆకలి తీర్చే రైతులకు అండగా నిలిచేందుకు దేశవ్యాప్తంగా ఉన్న రైతు ఉద్యమ నాయకులంతా కర్నూలుకు రాబోతున్నారని చెప్పారు. డిసెంబర్ 15, 16, 17న కర్నూలులో అఖిలభారత కిసాన్ సభ జాతీయ సమావేశాలను నిర్వహిస్తున్నామని, 15న రైతు మహా ప్రదర్శన, బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. రైతులకు అండగా జిల్లాలోని పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మండల నాయకులు వీరేష్, పరమేష్, వెంకటేష్, గోవిందు, శాంతన్నలతోపాటు మరో 80 మంది రైతులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా నాడు-నేడు పనులు

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు వెంకటేశులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

పనులను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

నాడు-నేడు పనులు అస్తవ్యస్తంగా ఉన్నాయని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కె.వెంకటేశులు తెలిపారు. శనివారం మండలంలోని కొత్తూరు ఎంపిపి స్కూల్లో జరుగుతున్న నాడు-నేడు పనులను వెంకటేశులు, సిపిఎం మండల కార్యదర్శి కె.లింగన్న, నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రెండేళ్లుగా స్కూల్ భవన నిర్మాణ పనులు అస్తవ్యస్తంగా సాగుతున్నాయని తెలిపారు. భవనం బేస్మెంట్‌పై వేసిన లెంత్ బీమ్ ఉండి పోయిందన్నారు. భవనం మధ్యలో నిలిచి పోయిందని, వంటగదిలో చదువులు కొనసాగిస్తున్నారని తెలిపారు. ఈ పనుల్లో ఇంజినీర్ల పర్యవేక్షణ లోపం కనిపిస్తోందని చెప్పారు. అధికారులు పనులను పూర్తి చేసి పాఠశాలకు ప్రహరీ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. సిపిఎం శాఖ కార్యదర్శి జి.రంగనాథ్, పార్టీ సభ్యులు బొజ్జప్ప, కర్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

'అనుమతి లేని పాఠశాలపై చర్యలు తీసుకోవాలి'

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని విక్టోరియా పేటలో ప్రభుత్వం అనుమతి లేకుండా నిర్వహిస్తున్న శ్రీగౌరీ గణేష్ పాఠశాల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు గోస్, శ్రీనివాసులు కోరారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శివరాములకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వ అనుమతి లేకున్నా అడ్మిషన్ నిర్వహిస్తున్న పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలన్నారు.

అవినీతికి తావు లేకుండా సంక్షేమ పథకాలు

- వైసిపి మండలాధ్యక్షులు భీమిరెడ్డి, ఇన్‌ఛార్జీ విశ్వనాథ్ రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

సంక్షేమ పథకాలను వివరిస్తున్న నాయకులు

వైసిపి పాలనలో అవినీతికి తావు లేకుండా లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందించినట్లు వైసిపి మండల అధ్యక్షులు జి.భీమిరెడ్డి, ఇన్‌ఛార్జీ విశ్వనాథ్ రెడ్డి తెలిపారు. శనివారం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు స్థానిక రామచంద్ర నగర్ కాలనీలో వైసిపి నాయకులతో కలిసి 'ఎపికి జగనే ఎందుకు కావాలి' నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందిన లబ్ధిదారులను కలుసుకుని మాట్లాడారు. ఉప సర్పంచి హోటల్ పరమేష్ స్వామి, ఎంపిటిసి జి.వెంకటేష్, వ్యవసాయ సలహా మండలి సభ్యులు మల్లికార్జున, మాజీ ఉప సర్పంచి గోర్కల్ కృష్ణస్వామి, నాయకులు శివకుమార్, జనార్దన్ రెడ్డి, నారాయణ, బొంబాయి శివ, జగదీష్ స్వామి, ఆడిట్ శంకరయ్య స్వామి, పేగుల రాము, రామకృష్ణ, సెంట్రింగ్ రాము పాల్గొన్నారు.

ఫ్యాక్షన్‌కు తావు లేకుండా చేశాం

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్

ప్రజాశక్తి - దేవనకొండ

వైసిపి ప్రభుత్వంలో ఫ్యాక్షన్‌కు తావివ్వకుండా పాలన కొనసాగించామని రాష్ట్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ తెలిపారు. శనివారం మండలంలోని పి.కోటకొండ, దుప్పాడ గుర్రి గ్రామాల్లో 'గడపగడపకు మన ప్రభుత్వం, 'ఎపికి జగనే ఎందుకు కావాలి' నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా గ్రామ సచివాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామస్తులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేశారని తెలిపారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా సబ్సిడీతో విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచి రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందించారని చెప్పారు. ఫ్యాక్షన్ గ్రామమైన పి.కోటకొండలో తాను ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి ఒక్క పోలీసు కేసు కూడా నమోదు కాలేదని తెలిపారు. పుర్తకులు, అసాంఘిక కార్యకలాపాలకు తావివ్వకుండా పాలన కొనసాగించామని, కోటకొండ అభివృద్ధి కోసం కృషి చేస్తామని చెప్పారు. గ్రామంలో గడపగడపకు తిరిగి సమస్యలను తెలుసుకొని సచివాలయానికి మంజూరయ్యే నిధులతో సిసి రోడ్లు, డ్రెయినేజీలు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అనారోగ్యానికి గురైన ఎంపిటిసి వెంకటలక్ష్మి కుమారుని ఇంటికి వెళ్లి పరామర్శించారు. పురుగు మందు తాగి ఆత్మ హత్య చేసుకున్న ఎంపిటిసి గిడ్డయ్య కుటుంబాన్ని పరా మర్శించారు. మంత్రి సోదరులు నారాయణ స్వామి, శ్రీని వాసులు, జడ్‌పిటిసి కిట్టు, ఎంపిపి భర్త లుముంబా, మండల కన్వీనర్ మల్లికార్జున, వైసిపి నాయకులు దివాకర్ నాయుడు, నిజాలు రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, నారాయణరెడ్డి, కృష్ణ, పెద్ద లింగన్న, లక్ష్మణ స్వామి, ముచ్చు రామచంద్ర, రంగడు పాల్గొన్నారు.

దేవనకొండలో మాట్లాడుతున్న మంత్రి జయరామ్

ఆదోని : సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో వేసి అవినీతి రహిత పాలన అందించడమే వైసిపి ప్రభుత్వ లక్ష్యమని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ జయ మనోజ్ రెడ్డి తెలిపారు. ఆదోనిలోని 8వ వార్డులో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. కౌన్సిలర్, వైస్ ఛైర్మన్ నరసింహులుతో కలిసి ఇంటికీ వెళ్లి వార్డు సమస్యలను తెలుసుకున్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను కోరారు. అమలవుతున్న సంక్షేమ పథకాలే వైసిపికి మరోసారి పట్టం కడతాయని తెలిపారు. వైసిపి పట్టణ అధ్యక్షులు బి.దేవా, స్టేట్ డైరెక్టర్ రేణుక, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, నాగరాజ్, తాయన్న, మల్లికార్జున, ఖాన్, ఇక్బాల్, అశోక్, గోపాల్, ఏసోబు, ఎల్లప్ప, శ్రీనివాస్ రెడ్డి, చిరంజీవి, సునాగ్, ప్రసాద్, బ్రహ్మయ్య, తారానాథ్, మోజెస్, వీరేష్, బాలరాజ్, నరసన్న, ఈశ్వర్, దినేష్, రీతుసింగ్, గోపాల్, లక్ష్మన్న, శ్రీనివాసులు, వెంకటేశులు, గురు స్వామి, రవి పాల్గొన్నారు.

ఆదోనిలో పర్యటిస్తున్న జయమనోజ్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్

వలస నివారణ చర్యలు చేపట్టాలి

- రైతుసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి రాజశేఖర్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

కర్నూలు జిల్లాలో వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా కరువు ఛాయలు అలుముకున్నాయని, జిల్లాలో వలసల నివారణకు చర్యలు చేపట్టాలని రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి రాజశేఖర్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక పద్మశాలి కళ్యాణ మండపంలో రైతు సంఘం ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు హనుమంతు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా రాజశేఖర్ హాజరయి మాట్లాడారు. జిల్లాలో రైతులు సాగు చేసిన పత్తి, ఉల్లి, వేరుశనగ, కంది, ఆముదం, మిర్చి, వంటి పంటలన్నీ వర్షాభావ పరిస్థితుల కారణంగా దెబ్బతిన్నాయని తెలిపారు. బోర్ల కింద సాగు చేసిన పంటలు మాత్రమే కొంత చేతికి వచ్చాయని చెప్పారు. పెట్టిన పెట్టుబడులు కూడా రాక రైతులకు అప్పులు మిగిలాయని తెలిపారు. వ్యవసాయ కార్మికులు, పేద రైతులు బతుకుదెరువు కోసం వలస వెళ్లారని చెప్పారు. గ్రామాలు ఖాళీ అయ్యే పరిస్థితి ఉందని, రాష్ట్ర ప్రభుత్వం 23 మండలాలను కరువుగా ప్రకటించిందని తెలిపారు. ఇప్పటివరకు సహాయ చర్యలు చేపట్టలేదన్నారు. డిసెంబర్ 15 నుంచి 17 వరకు కర్నూలులో జరిగే ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని కోరారు. రైతు కూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రాజు, రైతు నాయకులు సత్యన్న, రైతు సంఘం మండల అధ్యక్షులు లక్ష్మినరసయ్య, నాయకులు అబ్దుల్, రాముడు, ప్రసాద్, బాలు రాజు, రాముడు, తిమ్మన్న, సురేష్ పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

- నారాయణ కళాశాలల రాయలసీమ ఇన్‌ఛార్జీ లింగేశ్వర్‌రెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం కష్టపడి చదవాలని నారాయణ కళాశాలల రాయలసీమ ఇన్‌ఛార్జీ లింగేశ్వర్ రెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన లింగేశ్వర్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు మంచిగా చదివి కళాశాలతో పాటు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకు రావాలని తెలిపారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు, కళాశాలలో నైపుణ్యం ప్రదర్శించిన అధ్యాపకులకు అవార్డులను అందజేశారు. ఫ్రెషర్స్ డే సందర్భంగా విద్యార్థుల ఆటపాటలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. నారాయణ కళాశాల ఎమ్మిగనూరు ఇన్‌ఛార్జీ రమణారెడ్డి పాల్గొన్నారు.

ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ఉన్న లింగేశ్వర్ రెడ్డి

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

- ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - కౌతాళం

ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను తప్పకుండా పాటించాలని ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి ఆదేశించారు. వివిధ పాఠశాలల విద్యార్థులను తీసుకొచ్చే ఆటో డ్రైవర్లకు శనివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి డ్రైవరూ డ్రైవింగ్ లైసెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఇన్స్యూరెన్స్ పేపర్లు కలిగి ఉండాలన్నారు. విద్యార్థులను పాఠశాలలకు తీసుకొచ్చే సమయంలో అతివేగంగా నడపరాదని తెలిపారు. పరిమితికి నుంచి విద్యార్థులు ఉండరాదన్నారు. ఇటీవల విశాఖపట్నంలో జరిగిన ఆటో ప్రమాదాన్ని వారికి వివరించారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకోవాలన్నారు.

'రావూస్'లో ముందస్తు రాజ్యాంగ

అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిబ్బంది

దినోత్సవం

ఎమ్మిగనూరు : పట్టణంలోని రావూస్ డిగ్రీ కళాశాలలో శనివారం కళాశాల పొలిటికల్ సైన్స్, వ్యాయామ విభాగాల ఆధ్వర్యంలో ముందస్తు రాజ్యాంగ దినోత్సవం, జాతీయ వ్యాయామ ఉపాధ్యాయుల దినోత్సవం నిర్వహించారు. కళాశాల సిఇఒ తిరుమలరెడ్డి అధ్యక్షత వహించారు. కళాశాల పొలిటికల్ సైన్స్ లెక్చరర్ కె.గోరంట్ల మాట్లాడుతూ... భారత రాజ్యాంగం ప్రపంచలోని అన్ని రాజ్యాంగాల కంటే అతి పెద్దదని తెలిపారు. రాజ్యాంగం కల్పించిన హక్కులతో పాటు విధులను సక్రమంగా నిర్వర్తించాలని కోరారు. వ్యాయామ అధ్యాపకులు గోవింద్ మాట్లాడుతూ... ప్రతి విద్యార్థీ విద్యతోపాటు క్రీడల్లోనూ ఆసక్తి చూపాలని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రకాష్, వైస్ ప్రిన్సిపల్ ఇర్ఫాన్, కళాశాల బిఎ విభాగాధిపతి నరసింహులు, కళాశాల వ్యాయామ అధ్యాపకులు ధనుంజయ పాల్గొన్నారు.

సమిష్టి కృషితోనే మండలాభివృద్ధి

- ఎంపిపి లక్ష్మిదేవమ్మ

ప్రజశక్తి - నందవరం

అధికారులు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా కృషితోనే మండలాభివృద్ధి సాధ్యమని ఎంపిపి లక్ష్మిదేవమ్మ తెలిపారు. శనివారం ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ దశరథ రామయ్య అధ్యక్షత మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సచివాలయాల వారీగా అభివృద్ధి పనుల కోసం రూ.లక్షల్లో నిధులు కేటాయించిందని, నిధులతో ప్రజాప్రతినిధుల సూచనల మేరకు అధికారులు పనులు చేపడితే మండలం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. మండలాన్ని కరువుగా ప్రకటించారని, ప్రతి రైతుకూ హెక్టార్‌కు రూ.15 వేల చొప్పున అందిస్తారని, పంటల బీమా అందుతుందని చెప్పారు. వేసవి సమీపిస్తున్నందున అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం ఆయా శాఖల అధికారులు శాఖ పరిధిలోని అంశాలను వినిపించారు. తహశీల్దార్ నిత్యానంద రాజు, సర్పంచి విరుపాక్షి రెడ్డి, ఉప సర్పంచి శివారెడ్డి గౌడ్, ఎంఇఒలు సుదర్శన్ రెడ్డి, రంగనాథ్, ఆర్‌డబ్ల్యుఎస్, పిఆర్ ఎఇలు వెంకటరాముడు, జయన్న, ఎపిఎం వీరన్న, ఎపిఒ శ్రీనివాసులు పాల్గొన్నారు.

కచ్చితంగా మండల స్థాయి అధికారి రావాలి

- ఎంపిడిఒ దశరథ రామయ్య

సర్వసభ్య సమావేశానికి కచ్చితంగా మండల స్థాయి అధికారులే రావాలని, కిందిస్థాయి అధికారులు పాల్గొనడం వల్ల ప్రజలకు సరైన సమాచారం అందించలేకపోతున్నామని ఎంపిడిఒ దశరథ రామయ్య తెలిపారు. ఈ సమావేశానికి హాజరు కాలేకపోయినా వచ్చే సమావేశానికైనా కచ్చితంగా మండలస్థాయి అధికారులు హాజరు కావాలని, లేకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎపిఎం వీరన్న

వైసిపి హయాంలో విద్యావ్యవస్థ భ్రష్టు

- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం విద్యావ్యవస్థను భ్రష్టు పట్టించిందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి విమర్శించారు. విద్యార్థులకు జరిగిన అన్యాయంపై వారిలో చైతన్యం కల్పించేందుకు తెలుగు నాడు విద్యార్థి సమైక్య (టిఎన్ఎస్ఎఫ్) ముందుటుందని తెలిపారు. శనివారం బీవీ స్వగృహంలో టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. 'విద్యార్థి మేలుకో – భవిష్యత్తును కాపాడుకో' గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాఠశాలలను ప్రయోగశాలలుగా మార్చి విద్యార్థుల జీవితాలతో చెలగాటలాడుతున్నారని ఆవేదన వ్యక్తం చెశారు. విశ్వ విద్యాలయాలను వైసీపీ కార్యాలయాలుగా మార్చేశారని మండిపడ్డారు. విద్యార్థి లోకానికి జగన్ రెడ్డి చేసిన మోసాలపై డిసెంబర్ 7న రాష్ట్రవ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు చేయాలని తెలిపారు. అవగాహన ర్యాలీలు, సదస్సులు, సమావేశాలు నిర్వహించి విద్యార్థులందరినీ ఏకతాటిపై తీసుకురావాలని చెప్పారు. టిఎన్ఎస్ఎఫ్ నాయకులు మాదిగ నాగరాజు, రంజిత్, రమేష్ నాయుడు, సురేంద్రరెడ్డి, నరేంద్ర గౌడ్, వీరేష్ గౌడ్, భీమేష్ గౌడ్, రాజశేఖర్, గఫూర్, జిలాని, లక్ష్మన్న, ఐటిడిపి సోషల్ మీడియా రాంపురం రఫిక్ పాల్గొన్నారు.

గోడపత్రికను ఆవిష్కరిస్తున్న బీవీ, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు

రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి - మంత్రాలయం

అండర్-14 రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో మంత్రాలయం విద్యార్థిని సత్తా చాటారు. రెండో స్థానంలో నిలిచిన విద్యార్థిని అనితను ఉపాధ్యాయులు అభినందించారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయులు హంపయ్య ఆధ్వర్యంలో సర్టిఫికెట్ అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు హంపయ్య మాట్లాడారు. ఆగస్టు 13న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి ఫుట్‌బాల్ ఎంపికలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. ఈనెల 21, 22, 23న విశాఖపట్నం జిల్లా భీమవరంలో జరిగిన రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో జిల్లా జట్టు తరపున అనిత పాల్గొన్నారని చెప్పారు. ఈ పోటీల్లో కర్నూలు జట్టు శ్రీకాకుళంపైనా, విశాఖపట్నంపైనా, చిత్తూరు జట్టుపైనా గెలుపొందింద రాష్ట్రస్థాయిలో రెండో స్థానంలో నిలిచిందని తెలిపారు. జట్టులో కీలక సభ్యురాలైన అనిత చక్కటి ప్రతిభ కనబరిచి రజత పతకం సాధించారని చెప్పారు.

మహిళలపై హింసను అరికడదాం

- తహశీల్దార్ మల్లికార్జునస్వామి

హొలహర్వి : సమాజంలో మహిళలపై జరుగుతున్న హింసను అరికడదామని తహశీల్దార్ మల్లికార్జున స్వామి, ఎపిఎం శివయ్య తెలిపారు. శనివారం కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా స్త్రీశక్తి భవనంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బాలికలపై హింసను అరికట్టడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఆడపిల్లలను ఉన్నత చదువులు చదివించాలని, బాల్య వివాహాలను అరికట్టాలని కోరారు. తల్లిదండ్రులు ఆడ, మగ అనే వివక్ష చూపకుండా అందరినీ సమానంగా చూడాలని తెలిపారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. డిటి లక్ష్మి, మల్లేష్, సిసి వెంకటరత్నం, అకౌంటెంట్ నరసింహులు, విఒఎలు నాగమ్మ, ముత్తమ్మ, ఈరన్న, శేషప్ప పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

రాష్ట్రాభివృద్ధిలో వైసిపి విఫలం

- టిడిపి ఇన్‌ఛార్జీ తిక్కారెడ్డి

ప్రజాశక్తి - కోసిగి

రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడంలో వైసిపి ప్రభుత్వం విఫలం చెందిందని టిడిపి మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి విమర్శించారు. శనివారం మండలంలోని తుమ్మిగనూరు, సాతనూరు, అగసనూరు, కందుకూరు గ్రామాల్లో టిడిపి మండల కన్వీనర్ జ్ఞానేశ్ అధ్యక్షతన 'బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ' నిర్వహించారు. తిక్కారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయి మాట్లాడారు. టిడిపి అధికారంలోకి వస్తే మహిళలకు ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణం, 18 నుంచి 59 ఏళ్ల వయస్సున్న మహిళలకు నెలకు రూ.1500, తల్లికి వందనం పేరిట ఇంట్లో ఎంతమంది చదువుకునే పిల్లలుంటే అంతమందికి రూ.15 వేల చొప్పున నగదు అందించనున్నట్లు తెలిపారు. నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల భృతి, రైతులకు ఏటా రూ.20 వేలు, కుటుంబానికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు అందజేయనున్నట్లు చెప్పారు. టిడిపి మేనిఫెస్టోను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కోరారు. టిడిపి నాయకులు వక్రాని వెంకటేశ్వర్లు, నాడిగేని అయ్యన్న, నాడిగేని రంగన్న, మహాదేవ, వీరారెడ్డి, ఉమర్ సాబ్, కొరివి గుండేష్, సల్మాన్ రాజ్, రామయ్య, వారం గోపాల్, వడ్డే ఉలిగయ్య, వెంకటేష్, రామిరెడ్డి పాల్గొన్నారు.

ఆదోని (రూరల్) మండలం సాంబగల్లు గ్రామంలో 'బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ' నిర్వహించారు. టిడిపి ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు ముఖ్యఅతిథిగా హాజరయి మాట్లాడారు. రాష్ట్రానికి పరిశ్రమలు తీసుకురావడంలో వైసిపి ప్రభుత్వం విఫలం చెందిందని విమర్శించారు. టిడిపి మండల నాయకులు రామస్వామి, రంగస్వామి, ఆరేకల్ రామకృష్ణ, బుదఆర్డెడ్డి, దొడ్డనకేరి వీరేంద్ర, సాంబగల్లు గ్రామ నాయకులు, మాజీ సర్పంచి బి.లక్ష్మి, మాజీ ఎంపిటిసి బాలరాజు, లోకన్న, దస్తగిరి, రమేష్, వలీ, సూరి, తిక్కన్న, మౌలా పాల్గొన్నారు. **ఆస్పరి** మండలంలోని చిన్నహోతూరు, జోహరపురం గ్రామాల్లో 'బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ' నిర్వహించారు. టిడిపి ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ పర్యటించి టిడిపి మేనిఫెస్టోను వివరించారు. టిడిపి మండల కన్వీనర్ పరమారెడ్డి, సొసైటీ మాజీ డైరెక్టర్ కృష్ణ, ఎంపిటిసిలు నరసన్న, రహీంతుల్లా, నాయకులు తిమ్మన్న, శ్రీనివాస్ గౌడు, నెట్టప్ప, వరదరాజులు, నౌనేపాటి చౌదరి, రఘు, రాజ్‌కుమార్, సతీష్ కుమార్, షేక్షావలీ పాల్గొన్నారు.

కోసిగి మండలంలో మాట్లాడుతున్న తిక్కారెడ్డి

ఆదోనిలో పర్యటిస్తున్న మీనాక్షి నాయుడు

ఆస్పరి మండలంలో మాట్లాడుతున్న సుజాతమ్మ

సాగునీరందించి రైతులను ఆదుకోవాలి

- టిడిపి సీనియర్ నాయకులు సాయిబాబా

ప్రజాశక్తి - కౌతాళం

తుంగభద్ర దిగువ కాలువ కింద సాగైన పంటలకు సాగునీరందించి రైతులను ఆదుకోవాలని టిడిపి సీనియర్ నాయకులు సాయిబాబా, టిప్పు సుల్తాన్ కోరారు. శనివారం కర్నూలు నగరంలోని ఇరిగేషన్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎల్ఎల్‌సి కింద రూ.1.53 లక్షల ఎకరాల్లో రైతులు పత్తి, మిరప, వరి, వేరుశనగ, ఉల్లి తదితర పంటలను సాగు చేశారని తెలిపారు. ఈనెల 20న సాగునీటిన సరఫరా నిలిపివేయడంతో పంటలు ఎండు ముఖం పడుతున్నాయన్నారు. చేతికి వచ్చిన పంటలు ఎండిపోతుంటే రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఇటీవల తుంగభద్ర జలాశయంలో 4 టిఎంసిల నీరు వచ్చి చేరిందని చెప్పారు. ఆ నీటిని డిసెంబర్ 20 వరకు అందించవచ్చని తెలిపారు. రైతులకు సాగునీరందితే కనీసం పెట్టుబడులైన మిగులుతాయని చెప్పారు. లేకపోతే రైతులు ఆర్థికంగా నష్టపోయి అప్పుల పాలవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి సాగునీరందించి పంటలను కాపాడాలని కోరారు. రైతులు నబి, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న సాయిబాబా, రైతులు

వార్డులో ఒక్క అభివృద్ధి పనీ జరగలేదు

- కౌన్సిల్‌లో కౌన్సిలర్ అసహనం

ప్రజాశక్తి - ఆదోని

కౌన్సిలర్‌గా బాధ్యతలు చేపట్టి మూడేళ్లు గడిచినప్పటికీ తమ వార్డులో ఒక్క అభివృద్ధి పని కూడా జరగలేదని అధికార పార్టీ కౌన్సిలర్ ఉస్మాన్ అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. శనివారం మున్సిపల్ కౌన్సిల్ హాలులో ఛైర్మన్ శాంత అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాధాకృష్ణ, మున్సిపల్ వైస్ ఛైర్మన్ మహ్మద్ గౌస్ హాజరయ్యారు. కౌన్సిలర్లు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కౌన్సిలర్ ఉస్మాన్ మాట్లాడుతూ... వార్డులో రోడ్లు, డ్రెయినేజీ, కల్వర్టులు నిర్మించాలని ఇంజినీరింగ్ అధికారులతో ఎస్టిమేషన్ వేయించినప్పటికీ అజెండాలో ఎందుకు చేర్చడం లేదని అసిస్టెంట్ ఇంజినీర్ రాజశేఖర్ రెడ్డిని నిలదీశారు. అభివృద్ధి పనులు చేపట్టాలని అడుగుతున్నప్పటికీ తమ వార్డు పట్ల ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని, కౌన్సిలర్‌గా తాను పనికి రానా అంటూ అసహనం వ్యక్తం చేశారు. ఇలా ఉంటే తాను కౌన్సిలర్‌గా కొనసాగడం అవసరమా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిషనర్ రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ... త్వరలోనే ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడి పనులు జరిగేలా చూస్తామని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఆయన మధ్యలోనే కౌన్సిల్ నుంచి బయటకు వెళ్లిపోయారు. కౌన్సిలర్ రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ... రాంజల వద్ద కుక్కలకు ఆపరేషన్లు నిర్వహించి అక్కడే వదిలేయడం వల్ల హౌసింగ్ బోర్డు కాలనీలో వాటి బెడద ఎక్కువైందని తెలిపారు. బైక్, సైకిల్‌పై వెళ్తున్న వారిని వెంబడించి కొరుకుతున్నాయని చెప్పారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ హరినాథ్ మాట్లాడుతూ... ఆపరేషన్ అనంతరం కుక్కలను అడవుల్లో వదిలేయరాదని ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో వాటిని తరలించలేదని చెప్పారు. సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కౌన్సిలర్ బాలాజీ మాట్లాడుతూ... అధికారులు వార్డులో పర్యటించే సమయంలో స్థానిక కౌన్సిలర్‌కు సమాచారం ఇవ్వకుండా అవమాన పరుస్తున్నారని అభ్యంతర వ్యక్తం చేశారు. వీధి కుక్కలను పట్టేందుకు రూ.లక్షలు ఖర్చు చేశామని అధికారులు లెక్కలు చెబుతున్నారని, ఎక్కడ చూసినా కుక్కలు కనపడుతూనే ఉన్నాయని తెలిపారు. చెత్తకుండీల ఏర్పాటు, కుక్కల ఆపరేషన్లు వంటివి తమకు తెలియకుండానే చేయడం వల్ల స్పష్టమైన సమాచారం లేదని చెప్పారు. టిడిపి కౌన్సిలర్ పార్వతి మాట్లాడుతూ... ప్రశాంత్ నగర్‌లో సిమెంట్ రోడ్డు, డ్రెయినేజీ ఏర్పాటు చేస్తామని గతంలో అధికారులు చెప్పినా ఇంత వరకు అమలుకు నోచుకోవడం లేదని తెలిపారు. దుబ్బ గణపతి దగ్గర నుంచి డ్రెయినేజీ నిర్మించాలని కోరుతున్నా అక్కడే వదిలేశారన్నారు. డ్రెయినేజీ లేకపోవడం వల్ల మురుగునీరు నిలిచి పురుగులు బయటకొచ్చి దుర్గంధం వెదజల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలో తలెత్తుకొని తిరగలేని పరిస్థితి ఉందని, అధికారులు పనులు చేయాలని కోరారు. ఛైర్మన్ శాంత కలగజేసుకొని అన్ని వార్డులను అభివృద్ధి చేస్తామని, త్వరలోనే పనులు జరిగేలా చూస్తామని వివరించారు. కౌన్సిలర్ లక్ష్మీదేవి మాట్లాడుతూ... తమ వార్డులో పురాతన బావి ప్రహరీ నిర్మాణంలో తమకు తెలియకుండా నిధులు వెచ్చించారని తెలిపారు. గతంలో శివశంకర్ నగర్‌లో సిమెంట్ రోడ్డు నిర్మించినా పూర్తిస్థాయిలో బిల్లు ఇవ్వకుండా నష్టం కలిగించారని పేర్కొన్నారు. కౌన్సిలర్ సురేష్ మాట్లాడుతూ... తమ వార్డులోని చౌదరి బావి చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని కోరారు. కౌన్సిలర్ బాలాజీ మాట్లాడుతూ... 'గడపగడపకు మన ప్రభుత్వం' కింద తమ వార్డులో రూ.20 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదన్నారు. బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతోందని, నష్టం వచ్చే ప్రమాదం ఉందని కాంట్రాక్టర్లు వాపోతున్నారని సభ దృష్టికి తెచ్చారు. పనుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపరిచి బిల్లులు చెల్లిస్తున్నామని మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాధాకృష్ణ తెలిపారు. కౌన్సిలర్ రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ... హరిశ్చంద్ర ఘాట్ వాటికలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చూడాలన్నారు. ప్రస్తుతం నిర్మిస్తున్న ప్రహరీ ఎత్తు పెంచి అభివృద్ధి చేయాలని కోరారు. అభివృద్ధి పనులు జరిగేలా మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్ల భాగస్వామ్యంతో కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. కమిషనర్ రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ... పట్టణ ప్రజలకు తాగునీటి ఎద్దడి రాకుండా బసాపురం ఎస్ఎస్ ట్యాంకులో నీటి పంపింగ్ జరుగుతోందని తెలిపారు. అపోహలు వద్దని, నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కౌన్సిలర్లు చలపతి, చిన్నా, రాజేశ్వర్ రెడ్డి, ఫయాజ్, ఇంతియాజ్, వసీం, పద్మ, మహేశ్వరి, ఉమామహేశ్వరి, కీర్తన, పద్మావతి, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ శ్రీనివాసులు, డిప్యూటీ ఇంజినీర్లు వెంకట చలపతి రెడ్డి, రాజు నాయక్, అసిస్టెంట్ ఇంజినీర్ కృపాకర్, సీనియర్ అసిస్టెంట్ చంద్రమోహన్, లవ కుమార్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ హరినాథ్, మంజునాథ్ ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని పట్టుబట్టిన టిడిపి కౌన్సిలర్ పార్వతి

మాట్లాడుతున్న కమిషనర్ రఘునాథ్‌రెడ్డి

ఆరుతడి పంటకూ వదలని నీరు

- 200 ఎకరాల్లో వాడుముఖం పట్టిన జొన్న పంట
- 45 రోజులయినా ఒక్క తడికీ నీరివ్వని అధికారులు
- దిక్కుతోచని స్థితిలో గిద్దలూరు గ్రామ రైతులు
- అధికారులను సంప్రదించినా స్పందించని వైనం

వాడుముఖం పట్టిన జొన్న పంట

ప్రజాశక్తి - సంజామల

ఎస్ఆర్‌బిసి కాలువ కింద రైతులు ఆరుతడి పంటలు మాత్రమే సాగు చేసుకోవాలని ఇరిగేషన్ అధికారులు ప్రకటించారు. దీంతో రైతులు అధికారుల మాటలు నమ్మి సంజామల మండలం గిద్దలూరు గ్రామంలో దాదాపు 200 ఎకరాల్లో జొన్న పంటను సాగు చేశారు. జొన్న విత్తనం వేసి ఇప్పటికి 45 రోజులవుతున్నా ఒక్కసారి కూడా సాగు నీరు వదల లేదు. జొన్న పంటకు రెండుసార్లు నీరు కడితే పంట వస్తుంది. లేకుంటే పూర్తిగా ఎండిపోతుందని గిద్దలూరు గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కొంతమంది రైతుల జొన్న పంట ఎండిపోతున్నదని చెబుతున్నారు. సాగునీరు వదలకపోతే పంటలు ఎండిపో అప్పుల బారి పడాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు.

సంజామల మండలంలోని గిద్దలూరు గ్రామంలో ఎస్ఆర్‌బిసి కాల్వ నుండి 15వ బ్లాకు కాల్వ కింద సుమారు 200 ఎకరాల్లో రైతులు జొన్న పంట సాగు చేశారు. అధికారులు ఆరుతడి పైర్లు వేసుకోమని చెప్పడంతో రైతులు జొన్న పంట సాగు చేశారు. కానీ ప్రతి సంవత్సరం వరి పంట సాగు చేశారు. ఈఏడాది వర్షాలు లేక జలాశయాల్లో నీటి మట్టాలు ఆశించిన స్థాయికి చేరుకోలేదు. దీంతో అధికారులు కాల్వల కింద వరి పంటను సాగు చేసుకోవద్దని, కేవలం ఆరుతడి పంటలే సాగు చేసుకోవాలని ప్రకటించారు. దీంతో గిద్దలూరు గ్రామంలోని రైతులు జొన్న పంటను సాగు చేశారు. జొన్న పంటకు కేవలం రెండు సార్లు నీరు కడితే పంట వస్తుందనే ఆశతో రైతులు 45 రోజుల కిందట పంట సాగు చేశారు. జొన్న పంట సాగుకు ఎకరాకు విత్తనం, సేద్యపు ఖర్చులు అన్ని కలుపుకుని ఇప్పటి వరకు దాదాపు 18 వేల రూపాయలు పెట్టుబడులు పెట్టారు. పంట పూర్తి కాలం దాదాపు 85 రోజులు. ప్రస్తుతం పంటకు సాగు నీరు అందితే జొన్న పైరు పొట్టకు వస్తుంది. మళ్లీ 15 రోజుల తర్వాత సాగు నీరు వదిలితే జొన్న పంట రైతుల చేతికి వస్తుంది. ఒక్కొక్క రైతు నాలుగు ఎకరాల నుంచి 12 ఎకరాల వరకు జొన్న పంటను సాగు చేశారు. జొన్న పంటకు నీరు వదలాలని అధికారులను అడిగితే వదులుతామంటున్నారు కానీ వదలడం లేదని గిద్దలూరు గ్రామ రైతులు వెంకటేశ్వర్ రెడ్డి, సుబ్రమణ్యం, నాగభూషణం, నాగిరెడ్డి, వీరారెడ్డి తదితరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇదే కాలువకు సంబంధించి ఆకుమల్ల, ఆల్వ కొండ గ్రామ పంట పొలాలకు సాగునీరు వదులుతున్నారు. కానీ గిద్దలూరు గ్రామానికి చెందిన కాలువకు మాత్రం సాగునీరు రావడం లేదు. ఇదే విషయంపై అధికారులను అనేకసార్లు ప్రశ్నించగా సమాధానం సాగునీరు వదులుతామని చెబుతున్నారే తప్ప ఆచరణలో మాత్రం నీరు విడుదల చేయడం లేదు. జొన్న పంట సాధారణంగా ఎకరాకు బాగా పండితే 15 నుండి 20 బస్తాల వకు దిగుబడి వస్తుంది. బస్తా రూ. 3 వేలకు అమ్ముడుపోయినా పెట్టుబడులు పోగా ఎకరాకు రూ. 30 వేల వరకు మిగులుతుందనే ఆశతో రైతులు జొన్న పంట సాగు చేశారు. అయితే అధికారులు సాగునీరు విడుదల చేయకపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఇప్పటికైనా అధికారులు నీరు వదిలితే సగం పంట అయినా చేతికి వస్తుందని, లేకపోతే పూర్తిగా ఎండిపోతుందని, అప్పుల్లో కూరుకుపోవాల్సి వస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు రైతుల కష్టాలను దృష్టిలో పెట్టుకుని సాగునీరు వదలాలని గిద్దలూరు గ్రామ రైతులు కోరుతున్నారు.

సాగు నీటిపై అధికారులు స్పందించడం లేదు

అధికారులు ఆరుతడి పంట వేసుకోమంటే గ్రామంలో మొత్తం 200 ఎకరాల్లో జొన్న పంట సాగు చేశాం. విత్తనం వేసే సమయంలో అప్పుడు అధికారులు నీరు వదులుతామని చెప్పారు. పంట వేసి 45 రోజులవుతుంది. ఇప్పుడు నీరు అవసరం. నీరు ఇవ్వాలని అడిగితే అధికారులు సరిగా స్పందించడం లేదని. రెండు మూడుసార్లు డిఇ సార్‌కి ఫోన్ చేసిన స్పందించడం లేదు. ఇప్పటికైనా అధికారులు మా బాధలను అర్థం చేసుకొని 15వ ఎస్ఆర్‌బిసి కాలువకు నీళ్లు వదలి ఆదుకోవాలి.

- రైతు వెంకటేశ్వర్ రెడ్డి, గిద్దలూరు గ్రామం.

నీరు వదిలితేనే పంట వస్తుంది

నేను 12 ఎకరాలలో జొన్న పంట వేశాను. ఈసారి అధికారులు ఆరుతడి పంటలు వేయమని చెప్పడంతో జొన్న పంటను ఎక్కువ సాగు చేశాం. ఎకరాకు 18 వేల రూపాయలు ఖర్చు అయింది. జొన్న పంట పండకపోతే అప్పుల బారిన పడతాం. ఒక్కసారి నీరు వదిలితే రైతులంతా బాగుపడతారు. అధికారులు స్పందించి నీరు వదలాలి.

- రైతు నాగభూషణం, గిద్దలూరు గ్రామం.

తప్పుల తడక

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

ప్రభుత్వం చేపట్టిన భూ సర్వే తప్పుల తడకగా కనిపిస్తోంది. గత కొన్నేళ్లుగా అనుభవంలో ఉన్న భూమి ఇప్పుడు భూ సర్వే చేసిన అనంతరం కనిపించక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. భూ సర్వే ద్వారా భూ సమస్యలు తగ్గుతాయని భావిస్తే మరిన్ని భూతగాదాలకు కేంద్ర బిందువుగా మారుతుంది. ఎక్కడా నిబంధనలు పాటించకుండా నామమాత్రంగానే సర్వే నిర్వహిస్తున్నారు. రైతులకు భూ సర్వే మాత్రం భరోసా కల్పించలేకపోతుంది. భూ హక్కు పత్రాల్లో కూడా తప్పుల తడకగా వివరాలను నమోదు చేసి అందజేస్తున్నారు. దాదాపు వంద సంవత్సరాల క్రితం బ్రిటీష్ హయాంలో రెవెన్యూ భూముల సర్వేను నిర్వహించారు. అనంతరం అనేక ప్రభుత్వాలు భూ సర్వేకు చర్యలు తీసుకున్నప్పటికీ అనుకున్న ఫలితాలు సాధించలేకపోయాయి. కేంద్ర ప్రభుత్వం 2008లో చేపట్టిన జాతీయ భూ రికార్డుల ఆధునీకరణ కార్యక్రమం అమలులో భాగంగా రాష్ట్రంలోని జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం గత రెండు సంవత్సరాల క్రితం జగనన్న శాశ్వత భూహక్కు భూ సర్వే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మూడు దశల్లో భూహక్కు-భూ సర్వే కార్యక్రమాన్ని పూర్తి చేయాలని ప్రభుత్వం సన్నద్ధమయింది. ఈ ఏడాది డిసెంబర్ నాటికి సర్వే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. సర్వే నిర్వహించేందుకు స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ విధానాన్ని రూపొందించారు. ఈ విధానం కింద క్షేత్రస్థాయిలో సర్వే నిర్వాహణపై ఆదేశాలు జారీ చేశారు. భూ రికార్డుల స్వచ్ఛీకరణలో భాగంగా డ్రోన్ల ద్వారా శాటిలైట్ సహకారంతో గ్రామం మ్యాప్‌ను ఫొటో తీసి ఆ సమాచారాన్ని నేరుగా సర్వే ఆఫ్ ఇండియాకు అందజేస్తారు. సర్వేకు సంబంధించి రైతులకు ముందస్తుగా నోటీసులు సర్వే బృందాలు అందజేస్తారు. రైతుల భూమి సర్వే చేసిన అనంతరం ఫైనల్ రికార్డును ప్రకటించేటప్పుడు తప్పనిసరిగా గ్రామసభలు నిర్వహించాలి. జిల్లాలో ఎక్కడ కూడా గ్రామ సభలు నిర్వహించి ప్రత్యేకంగా రెవెన్యూ రికార్డును ప్రకటించలేదు. దీనివల్ల రైతులు అనేకమంది తీవ్ర అవస్థలు పడుతున్నారు. భూ హక్కు పత్రాల్లో కూడా అనేకమంది రైతులకు తక్కువ భూమి పొందుపరచడంతో రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ఈ సర్వే మాత్రం తూతూ మంత్రంగానే నిర్వహించి సరికొత్త భూ వివాదాలకు కారణం అవుతోంది.

అంగన్వాడీ సమస్యలపై

అంగన్వాడీ వర్కర్లు, ఆయాల సమస్యలను పరిష్కరించాలని జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. డిసెంబర్ 8 నుండి నిరవధిక సమ్మె చేపట్టనున్న నేపథ్యంలో అధికారులకు సమ్మె నోటీసులు అందజేశారు. అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అవీ..ఇవీ..అన్నీ..

ప్రైమ్ 2.0 విధానాన్ని రద్దు చేయాలని స్టాంప్ రైటర్లు, స్టాంప్ వెండర్లు నిరసన దీక్ష చేపట్టారు. రైల్వే ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ జిల్లా వ్యాప్తంగా పలు రైల్వే స్టేషన్ల ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో ధర్నాలు చేపట్టారు. వైసిపి ఆధ్వర్యంలో జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఏపికి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. టిడిపి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని జిల్లాలోని పలు ప్రాంతాల్లో చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. టిడిపి అధినేత చంద్రబాబునాయుడుకు హైకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో ఆ పార్టీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు.

30న రాష్ట్ర ముఖ్యమంత్రి రాక

- పర్యటన ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి : కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఈ నెల 30వ తేదీ అవుకు టన్నెల్ ప్రారంభిస్తున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లలో ఎలాంటి లోటు పాట్లు లేకుండా అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో సిఎం పర్యటన ఏర్పాట్లపై ఎస్పి కె.రఘువీర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డిలతో కలిసి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అవుకు పర్యటనను విజయవంతం చేసేందుకు అధికారులకు అప్పగించిన పనులు పక్కాగా పూర్తి చేయాలన్నారు. ప్రోటోకాల్ ప్రకారం అధికారులకు అప్పగించిన పనులు బాధ్యతాయుతంగా చేపట్టి ఎలాంటి లోపాలు లేకుండా పూర్తి చేయాలన్నారు. హెలిప్యాడ్ నుండి అవుకు టన్నెల్ వరకు 600 మీటర్ల రోడ్డును గుంతలమయం లేకుండా చదును చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. విద్యుత్ నిరంతరాయంగా సరఫరా చేయడంతో పాటు అవసరమైన జనరేటర్లను సిద్ధంగా ఉంచుకోవాలని ఎపిఎస్పిడిసిఎల్ అధికారులకు సూచించారు. హెలిప్యాడ్, మీటింగ్ సమీపాల్లో ఏర్పాటు చేసిన సేఫ్ రూముల్లో అత్యవసర మందులతో పాటు నిపుణులైన డాక్టర్లు సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని డిఎంహెచ్ఓ, జిల్లా ఆసుపత్రి వైద్యాధికారులను ఆదేశించారు. అవసరమైన ప్రదేశాల్లో తాగునీటి వసతి, మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని పబ్లిక్ హెల్త్, ఆర్డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ పుల్లయ్య, అన్ని శాఖల జిల్లాధికారులు తదితరులు పాల్గొన్నారు.

సిఎం పర్యటన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్

30న ముఖ్యమంత్రి అవుకు టన్నెల వద్దకు రాక

అవుకు : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఈ నెల 30న అవుకు టన్నెల్ వద్దకు వస్తున్నట్లు అధికారులు తెలిపారు. అవుకు వద్ద నిర్మిస్తున్న సొరంగ నిర్మాణం పూర్తి కావడంతో ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి జగన్ వస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రాక సందర్భంగా టన్నెల్ వద్ద హెలిప్యాడ్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు.

నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోండి

- ఆరుతడి పంటలు వేసుకునేలా విస్తృత ప్రచారం చేపట్టాలి

- తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలి - రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్

నీటిపారుదల సలహా మండలి సమావేశంలో మాట్లాడుతున్న ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జలాశయాల్లో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకుంటూ ప్రస్తుతం వేసుకున్న పంటలతో పాటు రబీ పంటలకు కూడా నీటిని అందించాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి జల వనరుల శాఖ ఇంజనీరింగ్, వ్యవసాయ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో మంత్రి బుగ్గన అధ్యక్షతన జిల్లా సాగునీటి, వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులు వరి వేయకుండా ఆరుతడి పంటలు వేసుకునేలా విస్తృత ప్రచారం చేయాలని అధికారులను అదేశించారు. హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ కింద వున్న రిజర్వాయర్లు, వాటి లభ్యత వివరాలను ఇరిగేషన్ ఎస్ఇని అడిగి తెలుసుకున్నారు. శ్రీశైల జలాశయంలో ప్రస్తుతం 839 అడుగులు వున్నాయని, 835 అడుగుల వరకు నీటిని విడుదల చేయవచ్చన్నారు. హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా నీరు వాడుకోవాడికి కచ్చితమైన ప్రణాళిక సిద్ధం చేసి అమలు చేయాలని ఎస్ఇని ఆదేశించారు. జిడిపి కింద 50 వేల ఎకరాల ఆయకట్టు వుందని, అలాగే తాగునీటికీ కూడా ఇబ్బంది లేకుండా ప్రణాళిక తయారు చేసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ మాట్లాడుతూ నీటి వనరుల లభ్యతను బట్టి సాగునీటిని విడుదల చేయాలన్నారు. నకిలీ విత్తన కంపెనీలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారిని ఆదేశించారు. ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి మాట్లాడుతూ అవుకు రిజర్వాయర్‌కు 2 టిఎంసిల నీటిని విడుదల చేయాలని సూచించారు. నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి మాట్లాడుతూ రైతులు చిరుధాన్యాలను ప్రత్యామ్నాయ పంటలుగా వేసుకునేలా ప్రోత్సహించాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. ఆళ్లగడ్డ, నంద్యాల ఎమ్మెల్యేలు గంగుల బ్రిజేంద్రా రెడ్డి, శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ కెసి కెనాల్ కింద ఇప్పుడు కూడా రైతులు నాట్లు వేసుకుంటున్నారని, ఈ నెల 27 వరకు నీళ్లు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో మైనారిటీ సంక్షేమ అభివృద్ధి సలహాదారు హాబీబుల్లా, జిల్లా ఎస్పి రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, నందికొట్కూరు ఎమ్మెల్యే తోగూర్ ఆర్థర్, కర్నూలు, నంద్యాల, వైఎస్ఆర్ కడప జిల్లాల వ్యవసాయ మండలి చైర్మన్‌లు వంగాల భరత్ కుమార్ రెడ్డి, బెల్లం మహేశ్వర రెడ్డి, ప్రసాద్ రెడ్డి, ఎపిఎస్పిడిసిఎల్ డైరక్టర్ శశికళ రెడ్డి, జలవనరుల శాఖ ఎస్ఈ వెంకటరమణ, జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రావు, ఇతర జిల్లాధికారులు, అన్ని ప్రాజెక్టుల ఇంజనీర్లు, వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

విఓఎల హక్కుల సాధనే లక్ష్యం

- ఎపి వైఎస్ఆర్ క్రాంతిపథం యూనియన్ వ్యవస్థాపకులు ప్రభుదాస్

ప్రజాశక్తి - రుద్రవరం

విఓఏల హక్కుల సాధనే ఎపి వైఎస్ఆర్ క్రాంతి పథం యూనియన్ లక్ష్యమని యూనియన్ వ్యవస్థాపకులు ప్రభుదాస్ తెలిపారు. శనివారం రుద్రవరంలో జరిగిన మండలం వైఎస్ఆర్ క్రాంతి పథం యూనియన్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విఓఎల హక్కుల సాధనలో భాగంగా మూడు సంవత్సరాలకాల పరిమితి సర్కులర్ రద్దు, గౌరవ వేతనం పెంపు, గౌరవ వేతనం విఓఎ అకౌంట్‌కే జమ, రూ. 10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్, 5జి మొబైల్ సౌకర్యం కల్పించాలని తదితర డిమాండ్ల సాధన కోసం నిరంతరం పోరాటం చేస్తామన్నారు. ఇంతకాలం కొన్ని యూనియన్లను నమ్మి మోసపోయామని, ఇకమీదట మోసపోవద్దని, హక్కుల సాధనకు కలిసికట్టుగా పోరాడుదామని కోరారు. జిల్లా అధ్యక్షుడు ఎంపీ నరసింహులు మాట్లాడుతూ విఓఎ సమస్యలపై రాష్ట్ర కమిటీ ప్రతినెల సమావేశమై చర్చించి సిఇఒ దృష్టికి తీసుకెళ్లి పరిష్కార మార్గం చూపుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి చిన్న పుల్లన్న, గౌరవ సలహాదారు మల్లిక, ఆళ్లగడ్డ మండలాధ్యక్షుడు రత్నం, చాగలమర్రి మండల గౌరవాధ్యక్షుడు ఓబులేసు, సిరివెళ్ల మండల గౌరవాధ్యక్షుడు బలరాముడు, ఉయ్యాలవాడ మండల కార్యదర్శి మద్దిలేటి, రుద్రవరం మండల నాయకులు సుభాష్, మరియమ్మ, ప్రతాప్, శేఖర్ రెడ్డి, సుబ్బయ్య, లక్ష్మీదేవి, చెన్నయ్య, అన్ని గ్రామాల విఓఏలు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

- 12 మంది అరెస్ట్ - రూ. 8.23 లక్షలు నగదు స్వాధీనం

ప్రజాశక్తి - మహానంది

మహానంది మండలం నందిపల్లి గ్రామ పొలిమేరలో పేకాట స్థావరంపై జిల్లా ఆదేశాల మేరకు కచ్చితమైన సమాచారంతో ఫ్యాక్షన్ జోన్ సిఐ చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో స్పెషల్ బ్రాంచ్ ఎస్సై జగదీశ్వర్ రెడ్డి, ఆర్ఎస్ఐ హర్షవర్ధన్ రెడ్డి, సిసిఎస్ సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది టీములుగా ఏర్పడి శనివారం దాడి చేశారు. 12 మంది పేకాట ఆడుతుండగా దాడి చేసి పట్టుకున్నారు. వారి నుండి మొత్తం రూ. 8 లక్షల 23 వేల 900 నగదును, ఒక కారు, ఒక మోటార్ సైకిల్, 10 సెల్‌ఫోన్లు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి వారిని అరెస్టు చేసినట్లు ఎస్సై నాగేంద్ర ప్రసాద్ తెలిపారు.

ఆహ్లాదకరంగా టూరిస్ట్ రెస్టారెంట్, పార్కు

- మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి - ఘనంగా చిన్న చెరువు కట్టపై టూరిస్ట్ రెస్టారెంట్, పార్కు ప్రారంభం

చిన్న చెరువు పార్క్‌ను ప్రారంభించిన ఆర్థిక మంత్రి, పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్, కలెక్టర్ తదితరులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల పట్టణంలోని చిన్న చెరువు కట్టపై టూరిస్ట్ రెస్టారెంట్‌ను పునరుద్ధరించడంతో పాటు అన్ని అధునాతన సదుపాయాలతో కూడిన పార్కును ప్రారంభించుకోవడం ఎంతో సంతోషంగా ఉందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక చిన్న చెరువు కట్టపై పునరుద్ధరించిన టూరిస్ట్ రెస్టారెంట్, పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్నిచ్చేలా ఏర్పాటు చేసిన పార్కును మంత్రి బుగ్గన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్, జిల్లా ఎస్పి కె.రఘువీర్ రెడ్డి, మైనారిటీ సంక్షేమ అభివృద్ధి సలహాదారు హబీబుల్లా, నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, స్థానిక ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మాబున్నిసా, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా టూరిజం అధికారి సత్యనారాయణ, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్థిక శాఖ మంత్రి మాట్లాడుతూ చిన్న చెరువు పార్కులో అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేసి నంద్యాల పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్నిచ్చే రీతిలో తీర్చిదిద్దామన్నారు. గ్రీన్ కో ఆధ్వర్యంలో చేపట్టిన నిర్మాణ పనులు ఆకర్షించే రీతిలో ఉన్నాయన్నారు. ఇటీవలకాలంలో టీవీలు, సెల్‌ఫోన్లకు అతుక్కుపోయే జనాలకు ఇలాంటి పార్కులు ఆరోగ్యాన్ని ఇవ్వడంతో పాటు ఆహ్లాదాన్ని ఇస్తాయని పేర్కొన్నారు. చక్కటి ప్రాంతంలో చిన్న చెరువు కట్టపై పార్కును అభివృద్ధి చేసి ఆకర్షించేరీతిలో అందుబాటులోకి తీసుకురావడం సంతోషకరమన్నారు. ఇందుకు కృషి చేసిన స్థానిక ప్రజాప్రతినిధులను, కలెక్టర్‌ను మంత్రి అభినందించారు. రాబోయే రోజుల్లో నంద్యాల జిల్లాను అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చిన్న పార్కులో రెస్టారెంట్ బిల్డింగ్ పునర్నిర్మాణ పనులు, చిన్నపిల్లల ఆట వస్తువుల పరికరాలు, అవుట్డోర్ జిమ్, ల్యాండ్ స్కేపింగ్, వాకింగ్ ట్రాక్, చెరువు చుట్టూ ప్రమాద నివారణ నిమిత్తం ఏర్పాటు చేసే ఐరన్ రక్షణ ఫెన్సింగ్, ఫుడ్ కౌంటర్ తదితర పనులను పూర్తి చేశామన్నారు. చెరువులో బోటింగ్ చేసేందుకు వీలుగా మోటార్ బోట్లు, పెడల్ బోట్ల నిర్వహణను ఏజెన్సీకి అప్పగించామని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే మాట్లాడుతూ నంద్యాల పట్టణంలో కుటుంబంతో ఆహ్లాదకరంగా గడపాలంటే ఎలాంటి సౌకర్యాలు లేని తరుణంలో చిన్న పార్కు అభివృద్ధి కావడం ఆనందించాల్సిన విషయమన్నారు. దాదాపు 60 లక్షల రూపాయలతో చిన్న పార్కును అభివృద్ధి చేసి అన్ని రకాల మౌలిక సదుపాయాలు సమకూర్చినట్లు పేర్కొన్నారు.

మాజీ ఎమ్మెల్యేను గజ మాలతో సత్కరిస్తున్ననాయకులు

కార్యకర్తలకు అండగా ఉంటా

- మాజీ ఎమ్మెల్యే బిజ్జం పార్థసారథి రెడ్డి

ప్రజాశక్తి - అవుకు

'నిత్యం నా వెంట ఉండి నన్ను నమ్ముకున్న కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి అండగా ఉంటా' అని మాజీ ఎమ్మెల్యే బిజ్జం పార్థసారథి రెడ్డి తెలిపారు. శనివారం అవుకు పట్టణంలోని తన అభిమాన కార్యకర్తలైన జయపాల్ రెడ్డి, సాత్రి రామయ్య ఇండ్లకు వెళ్లి వారి కుటుంబ బాగోగులు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తనను అభిమానించే కార్యకర్తల సమస్యలను పరిష్కరించడమే తన కర్తవ్యమన్నారు. కార్యక్రమంలో గుడాల ప్రతాపరెడ్డి, గుడాల మురళీధర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలని అనడం తగదు : మాజీ ఎమ్మెల్యే

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె

సామాజిక సాధికార బస్సు యాత్ర సదస్సులో మహిళలను నడిరోడ్డుపై కూర్చోబెట్టి అవమానించిన ఘటనపై అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తాను అసత్య ప్రచారాలు చేస్తున్నట్లు పేర్కొనడం తగదని మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా వైసిపి ఆధ్వర్యంలో జరుగుతున్న సామాజిక సాధికార బస్సుయాత్రల్లో వచ్చిన వారికి కుర్చీలేసే సమావేశాలు నిర్వహిస్తే ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో బనగానపల్లెలో మహిళలను నడిరోడ్డుపై కూర్చోబెట్టి అవమానించారని విమర్శించారు. మహిళలకు 500 కుర్చీలు వేయడానికి కూడా ఎమ్మెల్యే దగ్గర నిధులు లేవా అని ప్రశ్నించారు. 2009 నుండి 2014 వరకు ఎమ్మెల్యేగా కాటసాని రామిరెడ్డి చేసిన పనులు మిగిలిపోతే తాను పూర్తి చేశానని తెలిపారు. నాలుగున్నర సంవత్సరాలు షాదీఖానా గురించి పట్టించుకోకుండా ఎన్నికలు దగ్గర పడడంతో గ్రామ చివర కోయిలకుంట్ల రోడ్డులో నూతన షాదీఖానా నిర్మాణానికి భూమి పూజ చేయడం దారుణమన్నారు.

తెలుగు అధ్యాపకురాలికు జాతీయ అవార్డు

ప్రజాశక్తి - నందికొట్కూరు

నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకురాలు నందికొట్కూరు వాసి మల్లెపోగు వెంకటలక్ష్మమ్మకు విమల సాహితీ జాతీయ పురస్కారం దక్కింది. విమలసాహితీ పత్రికలో మల్లెపోగు వెంకట లక్ష్మమ్మ గౌరవ సలహారదారురాలుగా పని చేస్తున్నారు. పత్రికలో వారం వారం 'గుర్తు చేసుకుందాం' శీర్షికన వ్యాసం రాస్తూ, పత్రికను ముందుకు నడిపించేందుకు చేస్తున్న కృషికి ఈ అవార్డును ఈ నెల 19న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రదనం చేశారు. ఈ అవార్డును పద్మశ్రీ అవార్డు గ్రహీత ఆచార్య కొలకలూరి ఇనాక్, ప్రముఖ వాగ్గేయకారులు గోరేటి వెంకన్న, ప్రముఖ కవి కోటేశ్వరరావు, పత్రికా వ్యవస్థాపకులు డా.విద్యాధర్ చేతులమీదుగా అందుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.శశికళ, అకాడమిక్ కో ఆర్డినేటర్ డి.వెంకటేశ్వర్లు , అధ్యాపకులు అవార్డు గ్రహీతకు అభినందనలు తెలియజేశారు.

అవార్డును అందుకుంటున్న మల్లెపోగు వెంకటలక్ష్మమ్మ

కెసి అధికారుల నిర్లక్ష్యం.. మినుము పంట నీటిపాలు

- రూ.3 లక్షల మేర నష్టం

ప్రజాశక్తి - గడివేముల

కెసి కెనాల్ అధికారుల నిర్లక్ష్యానికి చేతికొచ్చి పంట నీటిపాలైన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. చిందుకూరు గ్రామానికి చెందిన రైతు మాను కింది నాగశేషులు రెండు ఎకరాల 75 సెంట్లు పొలంను కౌలుకు తీసుకొని మినుము పంట సాగు చేశాడు. పంట కోతకు సిద్ధంగా ఉన్న తరుణంలో గత 20 రోజుల నుండి కేసీ కెనాల్ నుండి నీరు విడుదల చేయడంతో కాలువ పైకెక్కి నీరు పారి రైతు నాగశేషులు పొలంలో మోకాళ్ళ లోతు నిలిచాయి. దీంతో చేతికొచ్చిన మినుము పంట బూజు పట్టి చెడిపోయింది. పెసరవాయి తూమువద్ద పలుమార్లు లష్కర్లకు ఒక్క అడుగు తగ్గించి నీటిని విడుదల చేయాలని బాధిత రైతు కోరాడు. అయితే కరిమద్దెల తూమును మూసివేసి చిందుకూరు పై గ్రామాలైన గడిగరేవుల, తిరుపాడు గ్రామాల పొలాల కోసం అధిక నీటిని విడుదల చేయడంతో చిందుకూరు గ్రామ కాలువ వద్ద నీళ్లు పైకెక్కి పారి పొలాలలో నీరు నిలిచాయి. దీంతో చేతికొచ్చిన పంట నీళ్ల పాలవుతుందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. పొలానికి కౌలు రూ.75,000, పెట్టుబడి రూ.1 లక్ష 35 వేలు అని, మొత్తం ఇప్పటికే 2 లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టానని, మూడు లక్షల రూపాయల పంట నీలపాలు అవుతుంటే పట్టించుకునే నాధుడే కరువయ్యారని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని పెసరవాయి తూము వద్ద ఒక్క అడుగు కిందికి నీటిని విడుదల చేస్తే పొలాల్లో నీరు పారకుండా ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు.

పొలంలో నీళ్లు నిలిచి దెబ్బతిన్న మినుము పంట

సర్పంచ్ చేతుల మీదుగా క్రీడా దుస్తులను పంపిణీ చేస్తున్న దృశ్యం

క్రీడాకారులను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి - పగిడ్యాల

క్రీడాకారులను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించినప్పుడే నిజమైన క్రీడా ప్రతిభ వెలుగులోకి వస్తుందని పగిడ్యాల సర్పంచ్ పెరుమాళ్ళ శేషన్న అన్నారు. హైమావతి స్పోర్ట్స్ స్టోర్ అధినేత శ్రీనివాసులు, శరత్ చంద్ర సహకారంతో పగిడ్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధుసూదన్ రావు అధ్యక్షతన శనివారం 14 మంది వాలీబాల్ క్రీడాకారులకు క్రీడా దుస్తులను సర్పంచ్ పెరుమాళ్ళ శేషన్న చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడారు. హైమావతి స్పోర్ట్స్ స్టోర్ అధినేతలు శ్రీనివాసులు, శరత్ చంద్రులు క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ చేయడం ఎంతో అభినందనీయమన్నారు. ఇలా ఎవరో ఒకరు తోచిన విధంగా క్రీడాకారులకు ప్రోత్సహిస్తే వారిలో ఉన్న ప్రతిభను వెలికి తీసి అవకాశం ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరు గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎంతోమంది క్రీడాకారులు తగిన ప్రోత్సాహం లేక వాళ్ల ప్రతిభ మరుగున పడిపోతుందన్నారు. అలాంటి కిరాకారులకు ఇలా దాతల రూపంలో ప్రోత్సాహం లభిస్తే క్రీడల్లో ప్రతిభ కనపస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రషీద్ మియ్య, కోచ్ శివ, క్రీడా శ్రీ తోకల పీతాంబ రెడ్డి, ఉపాధ్యాయులు క్రీడాకారులు పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలను జయప్రదం చేయండి

సమావేశంలో మాట్లాడుతున్న డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

ప్రజాశక్తి-డోన్

సోమవారం డోన్ పట్టణంలో నిర్వహించే అభివృద్ధి కార్యక్రమాలను జయప్రదం చేయాలని డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ కోరారు. శనివారం డోన్ పట్టణంలోని వైసిపి కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అధ్యక్షతన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ మాట్లాడుతూ సోమవారం ఉదయం 10 గంటలకు ఇందిరానగర్ ఆంజనేయస్వామి గుడి దగ్గర నుంచి వెంకటాపురం వరకు రూ.19.5 కోట్లతో నూతనంగా ఏర్పాటు చేసిన డబల్ లైన్ బీటీ రోడ్డును మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రారంభించి వెంకటాపురం వరకు పాదయాత్రగా బయలుదేరుతారని తెలియజేశారు. అలాగే సాయంకాలం నాలుగు గంటలకు కొత్త బస్టాండ్ దగ్గర ఉన్నటువంటి స్వామి వివేకానందుడి విగ్రహాన్ని ప్రారంభించిన తర్వాత రెండు కోట్ల రూపాయలతో ఏర్పాటు చేసిన సెంటర్ లైటింగ్ సిస్టం ను ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు,ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్ఎండి.జాకీర్ హుస్సేన్, కౌన్సిలర్ లు టిఈ.దినేష్ గౌడ్,నంద్యాల జిల్లా బీసీ అధ్యక్షులు పోస్టుప్రసాద్,పట్టణ జేఏసీ కన్వీనర్ కురుకుంద హరి,పట్టణ యూత్ అధ్యక్షులు అర్ఈ .రాజవర్ధన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సొంత డబ్బా కొట్టేందుకే బస్సు యాత్ర : బుడ్డా

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

ప్రజాశక్తి - ఆత్మకూర్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి డబ్బా కొట్టేందుకే వైసిపి బస్సు యాత్ర చేపట్టిందని శ్రీశైలం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి విమర్శించారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు పట్టణంలో జరిగిన సామాజిక సాధికారత బస్సుయాత్ర బహిరంగ సభలో పాల్గొన్న మంత్రులం దరూ తమకు మంత్రి పదవులు వచ్చాయని చెప్పుకోవడమే తప్ప నిజమైన ఎస్సీ ఎస్టీ బీసీలు మైనార్టీలు ఈ ప్రభుత్వంలో ఎక్కడైనా అభివృద్ధి చెందారాన్నారు. శ్రీశైలం నియోజవర్గంలో గత ప్రభుత్వంలో అమలు చేసిన పథకాలే వేసిన రోడ్లు పంట కాలువలు ఇరిగేషన్ పనులు తప్ప ఈ ప్రభుత్వంలో ఒక పని కూడా జరగలేదని ఆయన అన్నారు. నియోజవర్గంలో ప్రస్తుత ఎమ్మెల్యే శిల్పా ఇచ్చిన ఒక్క హామీ అమలు జరగలేదని విమర్శించారు. ఎమ్మెల్యే తనయుడు కార్తీక్ రెడ్డి అహంభావంతో మాట్లాడిన తీరును ఆయన ఖండించారు. బుడ్డా వంశం రాజకీయ చరిత్ర తెలుసుకొని మాట్లాడాలని లేకుంటే తగిన స్థాయిలో గుణపాఠం తప్పదని అన్నారు. రాజకీయాల్లో హుందాతనం లోపిస్తే ప్రజలే నీకు తగిన బుద్ధిని చెప్తారని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో టిడిపి నాయకులు గోవిందరెడ్డి. గిరిరాజు కరిముల్లా జట్టి వేణుగోపాల్ అబ్దుల్లాపురం భాష. ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్దిలేటి స్వామి ఆలయానికి రూ.5.69 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - బేతంచెర్ల

మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామ పరిధిలో వెలిసిన శ్రీ మద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి, అమ్మవార్లకు ఈ వారం (శనివారం) రూము బాడుగలు, చిరు వ్యాపారస్తుల సుంకములు తదితర వాటి వల్ల రు.5,69,247 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈవో పాండురంగారెడ్డి, చైర్మన్ సీతారామ చంద్రుడు తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ ఈ సందర్భ ంగా ఈవో పాండురంగారెడ్డి, చైర్మన్ సీతారామ చంద్రుడు మాట్లాడుతూ వచ్చే నెల డిసెంబర్ 21వ తేదీ నుండి 25వ తేదీ వరకు శ్రీ మద్దిలేటి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం నందు లక్ష్మీ వైకుంఠ ఏకాదశి ఉత్సవాలను పురస్కరించు కొంటున్న సందర్భంగా ఆలయ పరిసర ప్రాంతాలలో ఎక్కడ స్వామివారికి జంతుబలులను చేయరాదని వారు భక్తులకు సూచించారు.

వైఎస్ఆర్ బీమా అందజేత

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

నందికొట్కూరు పట్టణంలోని 8వ వార్డులో నివాసం ఉంటున్న సోమిశెట్టి వీరయ్య (66) శివానందమ్మ (54)లు రోడ్డు ప్రమాదంలో ఇటీవల మృతి చెందారు. శనివారం నాడు వారి కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా ద్వారా తక్షణ సహాయం కింద రూ.10,000 వార్డు ఇంచార్జి శాలి బాషా, వార్డు వెల్ఫేర్ సెక్రెటరీ అందజేశారు.

ప్రభుత్వ భవనాలు కట్టడం అభివృద్ధి కాదా?

- ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

ప్రజాశక్తి - బేతంచెర్ల

రహదారులు, విద్యాలయాలు, భవనాలు నిర్మించడం అభివృద్ధి కాదా.. ఇది తెలుగుదేశం పార్టీ నాయకులకు, కార్యకర్తలకు కల్పించడం లేదా అని రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. శనివారం నాడు బేతంచెర్ల పట్టణంలోని నాలుగవ సచివాలయం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి బుగ్గన మాట్లాడుతూ రూ.350 కోట్లతో వాటర్ గ్రిడ్ ద్వారా నెలరోజుల్లో ఇంటింటికీ తాగునీరు అందించడం జరుగుతుం దన్నారు. అధికారం కోసం ప్రజలకు మోసపూరితమైన వాగ్దానం ఇస్తూ ఇంటింటికి తిరుగుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. తెలుగుదేశం పార్టీ డోన్ ఇన్చార్జ్ ధర్మవరం సుబ్బారెడ్డి ఇచ్చే హామీలు నీటిమూటలన్నారు. బేతంచెర్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను రైల్వే అధికారుల దృష్టికి తీసుకువెళ్లి త్వరలోనే రెండు రైల్ ఓవర్ బ్రిడ్జిల ఏర్పాటుకు కృషి చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. బేతంచెర్ల పట్టణంలోని రైల్వే గేటు సమీపంలో రూ.40 లక్షలతో కొత్తగా నిర్మించిన సచివాలయ భవనాన్ని మంత్రి ప్రారంభించారు. అందుకు సంబంధించిన పైలాన్‌ను స్థానిక వైసిపి నాయకులతో కలిసి మంత్రి ఆవిష్కరించారు. పారిశ్రామికవేత్త, సచివాలయ స్థల దాత ఈ.వి సుజాత శర్మకు ఈ సందర్భంగా మంత్రి బుగ్గన కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు బేతంచర్ల వైసీపీ నాయకులు బాబుల్ రెడ్డి కర్నూలు పట్టణంలోని మోడ్రన్ ఐ హాస్పిటల్‌లో కళ్ళకి శస్త్ర చికిత్స చేయించుకున్న నేపథ్యంలో మంత్రి బుగ్గన స్వయంగా వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమ ంలో బేతంచెర్ల మున్సిపల్ చైర్మన్ చలం రెడ్డి, ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ మురళీకృష్ణ, ఉర్దూ కమిటీ సభ్యులు ముర్తూ జావలి, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఖాజా, ఎంఆర్వో నరేంద్రనాథ్ రెడ్డి, ఎంపీడీవో దస్తగిరి బాబు, రంగనాయకులు, కౌన్సిలర్లు, కోట్ల మధు, నిరంజన్, దస్తగిరి, గూని నాగరాజు, బీరేలి నాగేశ్వర్ రెడ్డి, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

బిసిల వెన్ను విరుస్తున్న సిఎం జగన్ : టిడిపి

కొలిమిగుండ్ల : కరపత్రాలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ రెడ్డి బిసిల వెన్ను విరుస్తున్నారని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి మండిపడ్డారు. శనివారం కొలిమిగుండ్ల మండలం బందర్లపల్లె గ్రామంలో బాబు ష్యూరిటీ–భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. గ్రామానికి చేరుకున్న మాజీ ఎమ్మెల్యేకు టిడిపి నాయకులు కళ్యాణ్ రెడ్డి, జనసేన నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి నాలుగున్నరేళ్ల పాలనలో 75 మంది బిసి నేతలు హత్యలకు గురయ్యారని, 5 వేల మంది బిసిలపై దాడులు జరిగాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఎన్నికల హామీలలో భాగంగా రాయల్టీ చెక్‌పోస్ట్‌ను ఎత్తివేస్తామని చెప్పి మాట తప్పిన ఎమ్మెల్యే, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి తండ్రి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ఎం రామేశ్వర్ రెడ్డి, నంద్యాల రామేశ్వర్ రెడ్డి మక్కల ఆది, (ఎంపీటీసీ) నీరజ, కోటపాడు శివరామిరెడ్డి, విశ్వనాథరెడ్డి, రాజశేఖర్ రెడ్డి, రామయ్య, సివాంజనేయ, శ్రీరాములు, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బనగానపల్లె : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని టిడిపి మైనార్టీ సెల్ నియోజకవర్గం అధ్యక్షులు రాయలసీమ సలాం పేర్కొన్నారు. పట్టణంలోని 1వ వార్డు ఎస్‌సి కాలనీ, బిందెల ఫ్యాక్టరీ ఏరియాలో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి ఆదేశాల మేరకు బాబు ష్యూరిటీ–భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. టిడిపి నాయకులు వెల్డింగ్ జాకీర్ పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ:** టిడిపితోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని తాలూకా యువ నాయకులు భూమా జగద్విఖ్యాత్ రెడ్డి అన్నారు. ఉయ్యాలవాడ మండలం కొండుపల్లి గ్రామంలో భవిష్యత్తుకు గ్యారెంటీ అనే కార్యక్రమంలో భాగంగా ప్రజావేదిక నిర్వహించి టిడిపి ప్రవేశపెట్టిన పథకాలను వివరించి అనంతరం ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరామ సుబ్బారెడ్డి, సిద్ధం రెడ్డి జాఫర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. **మహానంది :** సంక్షేమ పాలన, సామాజిక న్యాయం టిడిపి ప్రభుత్వంతోనే సాధ్యమని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్నారు. మహానంది మండలం గాజులపల్లి గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం టిడిపి మహిళా నాయకురాలు గంగవరపు శశికళ కొండారెడ్డి, మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. టిడిపి ప్రవేశపెట్టిన పథకాలను ఆయన ఇంటింటికి వెళ్లి వివరించారు. శ్రీశైలం నియోజకవర్గం బన్ను రామలింగారెడ్డి, గాజులపల్లి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. **ప్యాపిలి :** రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని డోన్ టీడీపీ ఇంచార్జి ధర్మవరం సుబ్బారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై నాగేశ్వరరావు యాదవ్‌లు విమర్శించారు. 2వ వార్డ్‌లో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్ర మాన్ని శనివారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి పోస్టర్లను పంపిణీ చేస్తూ టిడిపి పాలనకు, ప్రస్తుత వైసిపి పాలనకు తేడా, రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులపై ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో విధ్వంసకర పాలనను కొనసాగిస్తూ సైకో ఆనందం పొందుతున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో సైకో పాలనకు చరమగీతం పాడి, సైకిల్ పాలనను తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కాటమయ్య, మురళీకృష్ణ గౌడ్, రాఘవేంద్ర, భరత్ కుమార్ రెడ్డి, రామసుబ్బయ్య, రాంమోహన్ యాదవ్, చిన్నసుంకయ్య, వెంకటేశ్వరరెడ్డి, నాగేంద్ర, సుదర్శన్, సుధాకర్ గుప్తా, వార్డ్ మెంబర్ హారతి, కొంగనపల్లె మధు, ప్రిన్సిపాల్ మధు, మల్లికార్జున, చల్లా అనుదీప్,మౌలాలి రెడ్డి, రామాంజినేయులు, శివకిసోర్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న సుబ్బారెడ్డి చిత్రంలో నాగేశ్వరర రావు యాదవ్

మధ్యాహ్న భోజనం మెనూ చార్జీలు పెంచాలి

మండల విద్యాశాఖ అధికారికి వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - కొత్తపల్లి

గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకం పెరిగిన నిత్యవసర సరుకుల ధరలతో మధ్యాహ్న భోజన కార్మికులకు భారంగా మారిందని పెరిగిన ధరలకు అనుగుణంగా మధ్యాహ్న భోజన పథకం మెనూ చార్జీలు పెంచాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎన్ స్వాములు, ఏపీ మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం (సిఐటియు) మండల నాయకు రాలు నాగేశ్వరమ్మ, లక్ష్మీదేవి, రత్నమ్మలు డిమాండ్ చేశారు. శనివారం నాడు మండల విద్యాశాఖ అధికారులు శ్రీరాములు, ఇనాయ తుల్లా కు ఏపీ మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలకు ప్రభుత్వ పాఠశాలల్లో ఇస్తున్న మధ్యాహ్న భోజన పథకం నిర్వహణకు ప్రభుత్వం మెను చార్టును ప్రకటించింది అన్నారు. కానీ పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచకపోతే ఆ భారం ఎవరు భరించాలని ప్రశ్నించారు. కుండలో బువ్వ కుండ లోనే ఉండాలి పిల్లాడు మాత్రం గుమ్మడి పండులా ఉండాలంటే ఎలా సాధ్యమని మెనూ చార్జీలు పెంచకుండా నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించడం సాధ్యమవుతుందా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించి మెనూ చార్జీలు పెంచాలని జీ గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

నాలుగున్నరేళ్లుగా ప్రతి ఇంటికీ సంక్షేమం : ఎమ్మెల్యే

శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

రాష్ట్రంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. శనివారం చింతలయపల్లె, రాఘవరాజుపల్లె, మదనంతపురం, చెన్నంపల్లి చింతలయపల్లె గ్రామపంచాయతీ పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చింతలయపల్లె గ్రామంలోని ఓహెచ్ఆర్ ట్యాంకు సిసి రోడ్డును గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. లబ్దిదారులకు బ్రోచర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ ఇప్పుడు అందిస్తున్న పథకాలు రాష్ట్రంలో ప్రజలకు మంచి జరగాలంటే సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి ఉంటేనే సాధ్యమవుతుందని అన్నారు. ఈకార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ అంబటి గురివిరెడ్డి, అంబటి చంద్రమోహన్ రెడ్డి, అంబటి విజయ్ కుమార్ రెడ్డి, కె నారాయణరెడ్డి, నీలం సంజీవ కుమార్ రెడ్డి, సర్పంచ్ లక్ష్మీ నారాయణ యాదవ్, మండల అధ్యక్షురాలు నాగవేణి, మాజీ ఎంపిటిసి జయ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల కలెక్టరేట్ : రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి పాలన సాగుతుందని, అర్హతే ప్రామాణికంగా, కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైసిపి అని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు కల్పనా సెంటర్‌లో 182వ రోజు శనివారం ఉదయం పర్యటించారు. ఎమ్మెల్యేకు వార్డు కౌన్సిలర్ మజీద్, వైసిపి నాయకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి నాలుగున్నర సంవత్సరాలలో ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, పథకాలను ఎమ్మెల్యే ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో కూడా వైసిపి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు గంగిశెట్టి శ్రీధర్, పాంశావలి, కౌన్సిలర్లు సాదిక్ భాష, కలాం భాష, సమ్మద్, కోఆప్షన్ సభ్యులు సలాం ముల్ల, వైసిపి నాయకులు లక్ష్మీనారాయణ, కత్తి శంకర్, కిరణ్ కుమార్, అర్ల వెంకట స్వామి,గన్ని కరిం, రహమతుల్లా, గోపాల్ రెడ్డి, జాకీర్, అమీర్ భాష, మబ్బులు, అన్వర్ భాష తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు స్వాధీనం చేసుకున్న వరి ధాన్యం ట్రాక్టర్

ధాన్యం దొంగతనంలో నలుగురిపై కేసు

ప్రజాశక్తి - రుద్రవరం

మండలంలోని పాత వెలగలపల్లె గ్రామ సమీపంలో 20 బస్తాల వరి ధాన్యాన్ని దొంగిలించి నందుకుగాను నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శరత్ కుమార్ రెడ్డి తెలిపారు. శనివారం ఆయన తెలిపిన వివరాల మేరకు కొండ మాయ పల్లె గ్రామానికి చెందిన భాస్కర్ రెడ్డి అనే రైతు తన వరి పంటను కోతకోసి పాత వెలగలపల్లి చెరువు అలుగు ప్రాంత సమీపంలో ఆరబెట్టుకోవడం జరిగింద న్నారు. ఇది గమనించిన అదే గ్రామానికి చెందిన నందివర్ధన్, దస్తగిరి, మనోజ్, నరసింహ అనే వ్యక్తులు రాత్రి సమయంలో ట్రాక్టర్ ను తీసుకొని పోయి 20 బస్తాల వరి ధాన్యాన్ని ట్రాక్టర్లో దొంగతనంగా తీసుకొని వెళు తుండగా వారిని అదుపులోకి తీసుకోవడం జరిగింద న్నారు. రైతు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

శ్రీశైలంలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

- నల్లమల్ల రోడ్లన్నీ ట్రాఫిక్ జామ్

ప్రజాశక్తి - శ్రీశైలం

కార్తీక మాసం సందర్భంగా శ్రీశైల క్షేత్రంలో భక్తుల సంఖ్య అధికంగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా శనివారం ఆదివారం సెలవు దినాలు కావడంతో అదేవిధంగా ఆదివారం పౌర్ణమి కలిసి రావడంతో అధిక సంఖ్యలో ప్రత్యేక వాహనాల్లో భక్తులు శ్రీశైలం చేరుకుంటున్నారు. వాహనాల రాకతో అటవీ శాఖలోని నల్లమల్లరోడ్లన్నీ వాహనాలతో నిండిపోతున్నాయి. సింగిల్ రోడ్డు కావడంతో ట్రాఫిక్ జామ్ కావడం 20 కిలోమీటర్ల దూరంలో శ్రీశైలం చేరుకోవడానికి మూడు గంటల సమయం పడుతుందని వాహనదారులు అంటున్నారు. ముఖ్యంగా సున్నిపెంట మొక్క ద్వారా సాక్షి గణపతి ప్రాంతాల్లో వాహనాలు ట్రాఫిక్ జామ్ కావడం ఆగిపోవడం ఎక్కువ సమయం తీసుకుంటుంది. గత కొంతకాలంగా ఈ విధం ఈ విధంగా ట్రాఫిక్ జామ్ అవుతున్నప్పటికీ సంబంధించిన అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోక పోవడం బాధాకరమని యాత్రికులు తెలుపుతున్నారు. అధిక సంఖ్యలో శ్రీశైల క్షేత్రానికి చేరుకుంటున్న సందర్భంగా దేవస్థానం అధికారులు దృష్టిలో ఉంచుకొని ట్రాఫిక్ జామ్ కాకుండా తగిన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత పోలీసులు దేవస్థానం అటవీ శాఖ అధికారులు సంయుక్తంగా ఆలోచించడం ఎంతైనా ఉందని భక్తులు అంటు న్నారు. శ్రీశైలంలో కొనసాగుతున్న భక్తులను దృష్టిలో ఉంచుకొని భక్తులకు ఇలాంటి అవార్డుని సంఘటనలు జరగకుండా ఉండేందుకు తగిన చర్యలు తీసుకొని క్యూ లైన్ లో ఉన్న భక్తులకు అల్పాహారం మంచినీరు దేవస్థానం అందించడం జరుగుతుంది. క్షేత్ర పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేసి మొబైల్ వాహనాన్ని ఏర్పాటు చేశారు.

చిన్నారిని ఆశీర్వదిస్తున్న ఎక్కల దేవి చంద్రమౌళి

నామకరణ వేడుకల్లో ఎక్కల దేవి చంద్రమౌళి

ప్రజాశక్తి - నందికొట్కూర్ టౌన్

పట్టణంలోని హాజీ నగర్‌లో నివాసం ఉంటున్న రాచపూడి సరోజమ్మ రాచపూడి బాబు ప్రసాద్ గార్ల మనవరాలు నామ కరణ మహోత్సవం కార్యక్రమానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నందికొట్కూరు నియోజకవర్గ యువ నాయకులు ఎక్కలదేవి చంద్రమౌళి శనివారం హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకటేష్, రవికుమార్, మధు బాబు, ప్రసాద్, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

29న మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ:

నియోజ కవర్గంలోని ఉయ్యాలవాడ మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈనెల 29వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఉమా మహేశ్వరరావు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ సర్వసభ్య సమావేశం ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ అధ్యక్షతన జరుగుతుందన్నారు. అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు తప్పకుండా హాజరు కావాలన్నారు.

బానకచర్ల ఎస్‌సి కాలనీలో తాగునీటి సమస్య

ప్రజాశక్తి - పాములపాడు

మండలంలోని బానకచర్ల గ్రామ ఎస్సీ కాలనీ వాసులు తాగునీటి కొరతతో సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఎస్‌సి కాలనీలో గత ఆరు సంవత్సరాల క్రితం ఆనాటి ప్రభుత్వం బోరు వేసి మోటార్‌ను బిగించింది. ఆ బోరు ద్వారా ఎస్సీ కాలనీ వాసులకు సుమారు 100 కుటుంబాలకు తాగునీటి సరఫరా జరిగేది. గత ఐదు రోజుల క్రితం గ్రామానికి చెందిన యుగంధర్ రెడ్డి మోటారు పీకపోవడంతో కాలనీకి నీళ్ల రాలేదు. కాలనీవాసులు తాగునీరు లేక ఇబ్బందులకు గురవుతున్న పరిస్థితి ఉంది. స్థానికుల వివరాల మేరకు టిడిపి ప్రభుత్వంలో ఆరు సంవత్సరాల క్రితం ఎస్సీ కాలనీవాసులకు బోరు వేసి మోటారు బిగించారు. 5 హెచ్‌పి మోటార్‌ను బిగించారు. ఆ మోటార్‌కు నీరు అందడం లేదని యుగంధర్ రెడ్డి ఆ మోటార్‌ను తీసి 2.5 హెచ్‌పి మోటర్‌ను గత మూడుసంవత్సరాల క్రితం బిగించారు. గ్రామానికి విరాళంగా ఇచ్చాడు కానీ గత ఐదు రోజుల క్రితం తాను ఇచ్చిన మోటార్‌ను తానే తీసుక పోవడంతో ఎస్సీ కాలనీ వాసులకు తాగునీటి సమస్య ఏర్పడింది. విరాళం ఇచ్చిన మోటార్‌ను మళ్ళీ వెనక్కి తీసుకోవడం పట్ల గ్రామంలో తీవ్రత చర్చ కొనసాగుతుంది.

మోటర్ పోయిన బోర్‌ను చూపిస్తున్న ఎస్సీ కాలనీ వాసులు

కాలనీవాసులకు తాగునీటి సమస్య పరిష్కరిస్తాం

- నాగార్జున రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, బానకచర్ల గ్రామం.

ఎస్‌సి కాలనీ వాసులకు తాగునీటి సమస్యను తీర్చేందుకు కృషి చేస్తాం. మరో బోర్ నుండి తాగునీటిని సరఫరా చేస్తాం.

మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

పిఎస్‌కె కంపెనీపై చర్యలు తీసుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

నేషనల్ హైవే పేరుతో ప్రభుత్వ భూముల్లో పిఎస్‌కె కంపెనీ యాజమాన్యం గ్రానైట్ రాయిని నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం నాగేశ్వరావు ఆరోపించారు. శనివారం సిపిఎం నాయకులు కే భాస్కర్ రెడ్డి, పి పకీర్ సాహెబ్, కె ఆంజనేయులు, ఎం కర్ణ నాగన్న, సిపిఎం బృందం నందికొట్కూరు మండలం బ్రాహ్మణ కొట్టుకూరు కోళ్ల బాపురం సరిహద్దుల్లో సర్వే నెంబరు 486, 487లో నిబంధనలకు విరు ద్ధంగా 100 అడుగుల లోతు వరకు మట్టిని తొలగించారని వాటి మూలంగా హంద్రీనీవా కాలువకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని వారు ఆరోపించారు. అతి భారీ వాహనాలు తిరగడం వల్ల రోడ్లు దెబ్బ తినడం రైతుల పంట పొలాలు దుమ్ము దూళి విపరీతంగా పడి రైతులు పంటలు నష్టపోయారని వారు తెలియజేశారు. నిబంధనలకు విరుద్ధంగా గ్రానైట్ రాయిని అక్రమంగా తరలిస్తున్న పిఎస్‌కే కంపెనీపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మహారాజశ్రీ ఆళ్లగడ్డ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O S.No.168/2020

దెరెడ్డి వెంగమ్మ,
W/o. పుల్లారెడ్డి,
వయస్సు 70 సం॥,
హిందూ వ్యవసాయం,
యర్రగుంట్ల గ్రామం,
బండి ఆత్మకూరు మండలం,
కర్నూలు జిల్లా.
ఆధార్ నెం. 542030940614 ...వాది

V/S

కాల్ల ఆంజనేయులు
తండ్రి వెంగన్న
వయస్సు 50 సం॥, వ్యాపారం
యాళ్లూరు గ్రామం, గోస్పాడు మండలం,
కర్నూలు జిల్లా.
ఆధార్ నెంబర్ 6796 72212558 ...ప్రతివాది

ప్రతివాది కి దావా సమన్సు

వాది, ప్రతివాది అయిన నీపై బాకీ వసులు కోరి దావ దాఖలు చేసి ఉన్నందున సదరు దావా లో నీ యొక్క హాజరు నిమిత్తం వాయిదా 28-12-2023 వ తేదీన ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో నీవు స్వయంగా కాని, మీ వకీలు ద్వారా కానీ హాజరై మీ ఆక్షేపణలు తెలిపుకోవలెను. లేని యెడల నీకు పరోక్షంగా దావా తీర్మానించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా : 28-12-2023

ఇట్లు
బి.నీలకంఠేశ్వరం
వాది తరపున అడ్వకేట్,
ఆళ్లగడ్డ.

మహారాజశ్రీ ఆళ్లగడ్డ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A. No.418/2020 In O S.No.168/2020

దెరెడ్డి వెంగమ్మ,
W/o. పుల్లారెడ్డి,
వయస్సు 70 సం॥,
హిందూ వ్యవసాయం,
యర్రగుంట్ల గ్రామం,
బండి ఆత్మకూరు మండలం,
కర్నూలు జిల్లా.
ఆధార్ నెం. 542030940614. ...పిటిషనర్/ వాది

V/S

కాల్ల ఆంజనేయులు
తండ్రి వెంగన్న
వయస్సు 50 సం॥,
వ్యాపారం యాళ్లూరు గ్రామం,
గోస్పాడు మండలం, కర్నూలు జిల్లా.
ఆధార్ నెంబర్ 6796 7221 2558
...రెస్పాండెంట్ /ప్రతివాది

రెస్పాండెంట్ కు ఆర్డర్ 38 రూల్ 5 నోటీసులు

పిటిషనర్ /వాది, రెస్పాండెంట్ /ప్రతివాది అయిన నీపై బాకీ వసులు కోరి నీ యొక్క భూమి సర్వే నెం. 624/6 A.c.1-14 సెంట్లు నందవరం గ్రామంలోని భూమిని జప్తు కోరి పిటిషన్ దాఖలు చేసి ఉన్నందున సదరు పిటిషన్ లో నీ యొక్క హాజరు నిమిత్తం వాయిదా 28-12-2023 వ తేదీన ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో నీవు స్వయంగా కాని, మీ వకీలు ద్వారా కానీ హాజరై మీ ఆక్షేపణలు తెలిపుకోవలెను. లేని యెడల నీకు పరోక్షంగా పిటిషన్ ను తీర్మానించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా :28-12-2023

ఇట్లు
బి. నీలకంఠేశ్వరం
పిటిషనర్ తరపున అడ్వకేట్,
ఆళ్లగడ్డ.

మహారాజ శ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు :: నంద్యాల
O.S. NO.553/2022

M.దినేష్ రామిరెడ్డి. ...వాది

వర్సెస్

నారపరెడ్డి శ్రీనివాసరెడ్డి Died by his Lr's
1) నారపరెడ్డి ప్రభావతి
భర్త లేట్ నారపరెడ్డి శ్రీనివాసరెడ్డి
2) నారపరెడ్డి తేజ
తండ్రి లేట్ నారపరెడ్డి శ్రీనివాసరెడ్డి
పై ఇద్దరి అడ్రసు ప్లాట్ నెంబర్ 301,
అయ్యప్ప టవర్స్, N.G.O'S కాలనీ,
నంద్యాల టౌన్, నంద్యాల జిల్లా. ...ప్రతివాదులు

1 & 2 ప్రతివాదుల కి దావా సమన్సు

పై దావా నందు వాది దగ్గర, 1వ ప్రతివాది కి భర్త గారు, 2వ ప్రతివాదికి తండ్రి గారైయినా నారపరెడ్డి శ్రీనివాసు రెడ్డి డబ్బులు తీసుకుని బాకీ పడి అతను గతించుట ద్వారా తన వారసులైనటువంటి 1 & 2 ప్రతివాదుల పై దావా దాఖలుచేసి ఉండి ప్రామిసర్ నోటు డబ్బులు మొత్తం 2,85,972/- రాగోరి, 1&2 ప్రతివాదుల అయిన మీకు కోర్టు ద్వారా పోస్టు ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపించినను మీరు ఉద్దేశపూర్వకంగా తీసుకోనందున కోర్టు వారు ఉత్తర్వుల మేరకు తేదీ. 4-12-2023 న ఉదయం. 10.30 గంటలకు మీరు గానీ మీ తరపు వకీలు గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. మీరు హాజరుకాని పరోక్షంలో మీ పరోక్షంగా తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా తేదీ 4-12-2023

ఇట్లు
S. రామ తులసిరెడ్డి,
వాదిపరం అడ్వకేట్,
నంద్యాల.
సెల్ : 8897678989